సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 02 ::: సంచిక:19
Vol-02 ::: Issue-19

హైదరాబాద్ 19 ఆగస్టు 2026, బుధవారం
Hyderabad 19 August 2026, Wednesday

పేజీలు: 8, వెల: రూ. 5/-
Pages: 8, Rs. 5/-


## క్రీడాకారులకు 'అర్జున' పురస్కారాలు

అంతర్జాతీయ వేదికలపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన పలువురు యువ క్రీడాకారులకు ఈసారి అర్జున అవార్డుల్లో పెద్దపీట వేశారు.




...::: పూర్తి కథనం 7వ పేజీలో...


## అమెరికాలో హర్మూజ్ అంతర్భాగమే



హర్మూజ్ జలసంధి అమెరికాలో అంతర్భాగం అంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త వివాదానికి తెరలేపారు. ఈ జలసంధిని "కొత్త అమెరికా భూభాగం"గా అభివర్ణిస్తూ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'ని ఏకంగా అమెరికా అధికారిక మ్యాప్‌లోనే చేర్చారు. హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, నేవీ దిగ్బంధం ద్వారా దానిని తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## అమెరికా, ఇజ్రాయెల్‌పై భారీ యుద్ధానికి స్కెచ్?



యుద్ధ సన్నాహాలకు వినియోగం అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత లభించిన విరామ కాలాన్ని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఒక భారీ యుద్ధానికి సిద్ధమయ్యేందుకు వాడుకుందని అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. అమెరికా-ఇజ్రాయెల్ పెద్ద దాడికి సమయం కోసం చూస్తున్నాయని అంచనా వేసిన ఇరాన్ నాయకత్వం ఈ కాలాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...


## ఇమ్రాన్ ఖాన్ ను ఆస్పత్రికి తరలించండి



పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ (పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. జైలులో ఉన్న ఆయన ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుండటంతో, తక్షణమే ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని సుప్రీం కోర్టు ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను చూపిస్తూ ఆయన కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానం ఆదేశాలను పీటీఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## ఆహా.. ఎలక్ట్రిక్ విమానం వచ్చేసింది...



స్వీడన్ సంస్థ హార్ట్ ఏరోస్పేస్ అరుదైన మైలురాయి ఎలక్ట్రిక్ విమానయాన రంగంలో చారిత్రాత్మక ముందడుగు పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద పూర్తిస్థాయి బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ విమానం తొలి ప్రయోగాత్మక ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. స్వీడన్‌కు చెందిన 'హార్ట్ ఏరోస్పేస్' అభివృద్ధి చేసిన 30 సీట్ల సామర్థ్యం గల 'X1' విమానం కేవలం బ్యాటరీ విద్యుత్‌తోనే 27 నిమిషాల పాటు గాల్లో విహరించింది. న్యూయార్క్ లోని ప్లాట్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగంలో ఎలాంటి ప్రయాణికులు లేకుండా కేవలం పైలట్ మాత్రమే విమానాన్ని నడిపారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



# బీసీల జనాభా లెక్కలు తేల్చింది మేమే

సీఎం రేవంత్ కీలక ప్రకటన

ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ | బీఆర్ఎస్‌పై సంచలన ఆరోపణలు | కేసీఆర్ దిశ, దశ బాగోలేదని ఎద్దేవా

**బహుజన ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ నేతలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సామాజిక న్యాయమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో బీసీల జనాభా లెక్కలు తేల్చి న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో కుటుంబానికే కీలక పదవులు దక్కాయని విమర్శించిన సీఎం.. తమ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని అన్నారు.**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బహుజనుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని రేవంత్ రెడ్డి కొనియాడారు. హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఘనంగా మంగళవారం ఆవిష్కరించారు. పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడికి కనిపించేలా ఈ విగ్రహ ఏర్పాటు స్థలాన్ని తానే స్వయంగా ఎంపిక చేశానని తెలిపారు. విగ్రహ ప్రాశస్త్యం కోసం అక్కడే ఉన్న టూరిజం కార్యాలయాన్ని కూడా ఖాళీ చేయించి, అమరవీరుల స్థూపానికి ఉన్నంత ప్రాధాన్యతను పాపన్న విగ్రహానికి కల్పించామని సీఎం స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఏపీ బీజేపీపై కేంద్రం ప్రత్యేక దృష్టి

వైజాగ్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కీలక సమావేశం



**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలాన్ని గణనీయంగా పెంచుకోవడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సఖ్యతగా ఉంటూనే, సొంతంగా పార్టీ కేడర్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖపట్నం వేదికగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా పార్టీ బలబలాలు, కేడర్ సమర్థతపై ఆయన నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌ఛార్జ్ లు,ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా పార్టీ శ్రేణులకు నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. బీజేపీ కేడర్ నిరంతరం ప్రజల్లోనే ఉంటూ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల ద్వారా రాష్ట్రానికి జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గడిచిన 12 ఏళ్ల పాలనా పురోగతిని, ఆర్టికల్ 370 రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలను, 'ఆత్మనిర్భర్ భారత్' సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు, ఉదయం విశాఖ పర్యటనకు విచ్చేసిన నితిన్ నబీన్ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత బీచ్ రోడ్డులోని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో 'జెన్ జీ' యువత పాత్ర అత్యంత క్రియాశీలకంగా మారిన నేపథ్యంలో, వైజాగ్‌లో స్థానిక యువజన ప్రతినిధులు, యువ పారిశ్రామికవేత్తలు, నిపుణులతో నిర్వహించే ప్రత్యేక సమరసత భేటీలో కూడా ఆయన పాల్గొన్నారు.



## ప్రజల ఆస్తులతో ఆటలొద్దు

**మల్కాజిగిరి (ఏడీఎన్ఎన్) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములతో పాటు, హెచ్ఎండీఏ విక్రయించిన స్థలాలను కూడా 22ఏ జాబితాలో పెట్టడంపై ఆయన మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన తప్పులకు సామాన్య ప్రజలను ఎందుకు శిక్షిస్తున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్రం పెట్టుబడిదారులకు స్వర్గధామమని, రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్ పో 2026'ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు.ఈ సమ్మిట్‌కు హాజరైన పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి పూర్ణ హృదయంతో ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## సీజేపీ ఆందోళనలపై ఉన్నతస్థాయి కమిటీ

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**


దేశ రాజధాని ఢిల్లీలో 'చలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఈ కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ డీజీపీలతో ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు బుధవారం వెలువడనున్నాయి.

...::: తరువాయి 2వ పేజీలో...

## నీట్ నిరసనల్లో ఏకే-47 కాల్పులు వాస్తవమే




...::: పూర్తి కథనం 2వ పేజీలో...




## భారత్ -బంగ్లా-చైనా మధ్యలో 'తీస్తా' రగడ

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

- టీడీపీ బీసీలను నాయకులుగా తీర్చిదిద్దింది
- గత ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం
- కోర్టుకు వెళ్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

బీసీ సామాజిక వర్గానికి, టీడీపీకి మధ్య అవినాభావ సంబంధం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం తమకు కేవలం ఎన్నికల హామీ మాత్రమే కాదని, అదొక రాజకీయ సిద్ధాంతమని ఆయన ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు శాసనసభ వేదికగా మంగళవారం మాట్లాడారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## మహనీయులు పాడిన గేయాన్నే మేమూ పాడాం...



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వందేమాతర గేయ ఆలాపనపై చెలరేగిన వివాదంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఈ విషయంలో తమ పార్టీ తీరును ఆయన బలంగా సమర్థించుకున్నారు. తాము కొత్తగా ఏమీ పాడలేదని.. జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ తదితర మహనీయులు ఆలపించిన గేయాన్నే తామూ పాడామని మంగళవారం ఆయన స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## నల్గొండ కార్యకర్తలే కాంగ్రెస్‌కు వెన్నెముక



**భువనగిరి (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక ఎంతో మంది సామాన్య కార్యకర్తల రక్తం, చెమట, త్యాగాలు ఉన్నాయని, వారి సేవలను పార్టీ ఎన్నటికీ విస్మరించదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. భువనగిరిలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమక్షంలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ ఆయన చేసిన ప్రసంగానికి నాయకులు, కార్యకర్తల నుంచి విశేష స్పందన లభించింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## అధికారం శాశ్వతం కాదు మర్చిపోవద్దు




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి తన పాశవికత్వాన్ని నిరూపించుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని, అందుకే పోలీసులను ఉసిగొలిపి అర్ధరాత్రి దొంగల్లా విగ్రహాన్ని తొలగించారని ఆయన మండిపడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో...

# నీట్ నిరసనల్లో ఏకే-47 కాల్పులు వాస్తవమే



**పాట్నా (ఏడీఎన్ఎన్) :**

నీట్ యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు ఏకే47తో కాల్పులు జరపడం వాస్తవమేనని బిహార్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. అయితే, ఆ కాల్పులు ఎవరినీ గాయపరచడానికి కాదని, ప్రాణరక్షణ కోసం గాలిలోకి జరిపినవని పేర్కొంది. ఆగస్టు 17న సీజేపీ ఉద్యమం నేపథ్యంలో పోలీసుల తీరుపై దాఖలైన పిటిషన్‌కు స్పందిస్తూ బిహార్ సర్కార్ మంగళవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. జులై 25న సివాన్‌లోని జేపీ చౌక్ వద్ద జరిగిన నిరసనల్లో కానిస్టేబుల్ అభిషేక్ కుమార్ ఆందోళనకారుల మధ్య చిక్కుకుపోయినట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో వివరించింది. ఆ గుంపు నుంచి తనను తాను రక్షించుకుని, తప్పించుకునే క్రమంలోనే తన వద్ద ఉన్న ఏకే47 తుపాకీతో గాలిలోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని తెలిపింది. అలాగే, హతి చౌక్ సమీపంలో నిరసనకారులను చెదరగొట్టేందుకు ఏఎస్ఐ నిలేశ్ కుమార్ సింగ్ సైతం తన 9ఎంఎం పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు అంగీకరించింది. పోలీసుల చర్యల వల్ల ముగ్గురు ఆందోళనకారులకు చిన్నపాటి తుపాకీ గాయాలు అయిన మాట వాస్తవమేనని, అయితే వారు ఏకే47 బుల్లెట్లతో గాయపడలేదని బిహార్ సర్కార్ కోర్టుకు తేల్చిచెప్పింది. ఏకే47తో గాలిలోకి కాల్పులు జరిపిన ప్రదేశంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది. విపత్కర పరిస్థితుల్లోనే ఆ కానిస్టేబుల్ కాల్పులు జరిపినప్పటికీ.. అతడిని ఇప్పటికే సస్పెండ్ చేశామని, శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోందని స్పష్టం చేసింది. ఆందోళనల సమయంలో భద్రతా దళాలు అత్యంత సంయమనం పాటించాయని, విద్యార్థులపై ఎక్కడా విపరీతమైన బలప్రయోగం చేయలేదని ప్రభుత్వం పేర్కొంది. అయితే, నిరసనకారుల ముసుగులో కొందరు అసాంఘిక శక్తులు చొరబడి అధికారులపై దాడులకు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల జిల్లాల వారీ వివరాలను సైతం అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది.

# ప్రజల ఆస్తులతో ఆటలొద్దు

**మొదటిపేజీ తరువాయి...**

అధికారులు తప్పు చేశారని మంత్రి పొంగులేటి కేవలం 'సారీ' చెప్తే సరిపోతుందా అని నిలదీశారు. ఇది 30 శాతం కమీషన్ ప్రభుత్వమని, ఏ పని కావాలన్నా కమీషన్ అడుగుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉందని, మరి దాన్ని తొలగించుకునేందుకు సీఎం ఏ మీసేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీసులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పుకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాజేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వాళ్లే ఉద్దేశపూర్వకంగా తప్పు చేసి ఇప్పుడు అధికారులపై నెడుతున్నారని మండిపడ్డారు. నిజాయితీ ఉంటే నిషేధిత జాబితా నుంచి రాత్రికి రాత్రే తొలగించిన భూముల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని డిమాండ్ చేశారు.మంత్రుల కమీషన్ల కోసం పెన్నుపోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దని, రేపు ఏదైనా జరిగితే మీరే బలవుతారని రెవెన్యూ అధికారులను హరీశ్ రావు హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు జరిగినా ఈ నిషేధిత భూముల వ్యవహారంపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులపై ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే ప్రజలు పాతర వేస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయడం లేదని విమర్శించిన ఆయన.. బాధితులకు అండగా ఉండేందుకు తమ 'జనతా గ్యారేజ్' తెలంగాణ భవన్ ఎప్పుడూ తెరిచే ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సీజేపీ ఆందోళనలపై ఉన్నతస్థాయి కమిటీ

**మొదటిపేజీ తరువాయి...**

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీలు, సీసీటీవీ రికార్డింగ్స్ అన్నింటినీ ఈ ఉన్నతస్థాయి కమిటీకి అందజేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో మహిళా నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలు, నమోదైన ఫిర్యాదులన్నింటినీ ఈ కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. బాధితుల వాదనలను నేరుగా విన్న తర్వాత కమిటీ ఇచ్చే నివేదిక, సిఫార్సుల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని కోర్టు పేర్కొంది.

**విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌ల వివరాలు ఇవ్వండి: ఎస్‌జీకి ఆదేశం**

ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల పూర్తి వివరాలను కోర్టుకు అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కింద శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఎలాంటి నేర చరిత్ర లేని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే అంశాన్ని తాము పరిశీలిస్తామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి...**

ఇంధన రంగంలో మార్పు తీసుకురావడం అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం కాదని, అది మొత్తం ఆర్థిక వ్యవస్థ రూపురేఖలనే మార్చే విప్లవాత్మక అడుగు అని పేర్కొన్నారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధన వినియోగదారుగా మాత్రమే కాకుండా, ప్రపంచస్థాయి క్లీన్ ఎనర్జీ పరికరాల తయారీ కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే పర్యావరణ పరిరక్షణ కోసం భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించనున్నట్లు తెలిపారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగానికి అత్యంత కీలకమైన పంప్డ్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు.హైదరాబాద్‌కు ఉన్న ఐటీ, ఏఐ (AI) నైపుణ్యాలను ఉపయోగించుకుని భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను పూర్తిగా డిజిటల్ నెట్‌వర్క్ గా మారుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని, 2035 నాటికి 12,000 ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే కంపెనీలకు ప్రభుత్వం నుంచి పూర్తి ప్రోత్సాహం ఉంటుందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. మూలధన సాయం, ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని తెలుపుతూ.. సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులతో కలిసి ఆయన సందర్శించారు.

# బీసీల జనాభా లెక్కలు తేల్చింది మేమే

**మొదటిపేజీ తరువాయి...**

**బ్రిటిష్ లైబ్రరీలో పాపన్న ఘన చరిత్ర**

సర్వాయి పాపన్న గౌడ్ అద్భుతమైన వీరగాథను లండన్‌లోని బ్రిటిష్ లైబ్రరీలో సైతం భద్రపరిచారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన ఈ వీరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠాత్మక స్థానంలో నెలకొల్పాలని గీత కార్మికులు ఎంతో తాపత్రయపడ్డారని, ఆ కలను ఇప్పుడు నెరవేర్చామని పేర్కొన్నారు. అయితే, మన ఘన చరిత్రను ప్రపంచానికి సగర్వంగా చెప్పుకోవడంలో మనం కాస్త వెనుకబడ్డామని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ గడ్డపై పుట్టిన మహనీయుల పోరాటాలను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**సామాజిక న్యాయం.. కులవృత్తులకు అండ**

రాష్ట్రంలో బహుజన ఆత్మగౌరవాన్ని కాపాడేలా తమ ప్రజాపాలనలో సామాజిక న్యాయానికి, సమాన అవకాశాలకు పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి, వారికి న్యాయం చేసిన తొలి ప్రభుత్వం కాంగ్రెస్ సర్కారేనని ఆయన తేల్చిచెప్పారు. రాష్ట్రంలో నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ప్రభుత్వ భూముల్లో పెద్ద ఎత్తున ఈత, తాటి వనాలను పెంచాలని పిలుపునిచ్చారు. కుల వృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, వారి విద్యాభ్యాసం కోసం ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం భరోసా ఇచ్చారు.

**కుటుంబ పాలన వర్సెస్ బహుజన సాధికారత**

గత ప్రభుత్వ పాలన తీరుపై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే కాంగ్రెస్ పాలనలో తాను సీఎం అయితే బీసీ నేత మహేష్‌కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన సీతక్క, వాకిటి శ్రీహరి లాంటి వారు మంత్రులయ్యారని సగర్వంగా చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తూ శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చామని.. కానీ కేసీఆర్ మాత్రం ఉద్యమకారులను పక్కనపెట్టి ఎర్రబెల్లి, వినోద్‌రావు లాంటి వారికి పదవులు ఇచ్చారని ముఖ్యమంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**గొర్రెల పంపిణీతో బహుజనులకు అన్యాయం**

నాడు కేసీఆర్ పాలనలో బీసీలను కేవలం కుల వృత్తులకే పరిమితం చేసే కుట్ర జరిగిందని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. అధికారం మొత్తం వాళ్లే అనుభవిస్తూ, బహుజనులను మాత్రం వెనుకబాటే ఉంచాలని చూశారు" అని దుయ్యబట్టారు. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబ సభ్యులకు వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు వచ్చాయని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని సీఎం వివరించారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలకులు చేసిన ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులు ఈనాడు తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ముప్పుగా మారాయని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ అప్పులకు నిరంతరం వేల కోట్ల వడ్డీలు కడుతూనే, మిగిలిన డబ్బుతో ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దిశ, వాస్తు బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని, కానీ కేసీఆర్ దిశ, దశ ఏమాత్రం బాగాలేదు కాబట్టే.. ఇప్పుడు అదే సచివాలయంలో తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూర్చుని ప్రజలకు పాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు.

**అఘోరాలతో క్షుద్రపూజలు చేయిస్తున్నారు**

ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్ రావుల తీరుపై సీఎం సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పోవాలని, తెలంగాణలో కరవు రావాలని కోరుకుంటూ వారు తమిళనాడు నుంచి అఘోరాలను రప్పించి చేతబడులు, క్షుద్రపూజలు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. సాధారణంగా గ్రామాల్లో ఇలా చేతబడులు చేసేవారిని ప్రజలు చెట్లకు కట్టేసి కొడతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ఈ ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల పాలన రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే**

భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని తెలిపారు. రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తిరిగి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన జోస్యం చెప్పారు. త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత రాష్ట్రంలో మొత్తం 117 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని భారీ మెజార్టీతో మళ్లీ రికార్డు సృష్టిస్తుందని రేవంత్ రెడ్డి గట్టి నమ్మకం వ్యక్తం చేశారు.

# పోలీసుల క్రూరత్వాన్ని ప్రశంసించాలా..?

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల సమయంలో ఎవరికీ హాని జరగలేదని, ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. దేశ విద్యార్థులతో అవాస్తవాలు చెప్పొద్దని, వారికి కళ్లు, జ్ఞాపకశక్తి ఉన్నాయని 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. పార్లమెంటు సమీపంలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపి, మేకులతో కూడిన లాఠీలతో కొట్టారని, ఈ తరహా పోలీసు క్రూరత్వాన్ని ప్రశంసించాలా అని ఆయన ప్రశ్నించారు. గాయపడిన విద్యార్థులను తాను స్వయంగా కలిశానని, అక్కడ ఏం



జరిగిందో దేశమంతా చూసిందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ ఇప్పటివరకు విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదని, సొంత తప్పులను అంగీకరించే మనస్తత్వం కేంద్రానికి లేదని విమర్శించారు. పోలీసులను మెచ్చుకోవాలన్న కేంద్రమంత్రి ఇంతకుముందు ఒక ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. జంతర్‌మంతర్ నిరసనల్లో వేలాది మంది పాల్గొన్నారని, విద్యార్థుల ముసుగులో ఆప్, సమాజ్‌వాదీ పార్టీల ప్రతినిధులు, నేరగాళ్లు చొరబడి హింసను ప్రేరేపించారని ఆరోపించారు. అంతటి భారీ నిరసనలు జరిగినా ఢిల్లీ పోలీసులు ఒక్క లాఠీ కూడా వాడలేదని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని అదుపు చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు పార్లమెంటు వైపు దూసుకెళ్లకుండా మాత్రమే అడ్డుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసినందుకు ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలని రిజిజు సమర్థించుకోవడంతో రాహుల్ గాంధీ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు.

# పసిబిడ్డతో అసెంబ్లీకి టీవీకే ఎమ్మెల్యే

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాడు శాసనసభ సమావేశాలు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతుండగా, టీవీకేకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధి తన బాధ్యతలను, మాతృత్వాన్ని సమతుల్యం చేసుకుంటున్న తీరు వార్తల్లో నిలిచింది. చెన్నైలోని తిరువిక్కా నగర్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా శాసనసభకు ఎన్నికైన టీవీకే (తమిళగ వెట్రి కళగం) ఎమ్మెల్యే ఎం.ఆర్. పల్లవి తన కొన్ని నెలల పసిపాపతో కలిసి ప్రతిరోజూ అసెంబ్లీ ప్రాంగణానికి హాజరవుతున్నారు. సమావేశాలు జరిగే సమయంలో పాపను ప్రాంగణంలోని ప్రత్యేక గదిలో సహాయకురాలి సంరక్షణలో ఉంచి, తర్వాత సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. కొందరు నెటిజన్లు ఆమె నిర్ణయాన్ని ప్రశంసిస్తూ మద్దతు తెలుపుతుంటే, మరికొందరు మాత్రం ఎమ్మెల్యే కావాలనే హడావిడి సృష్టిస్తున్నారని, ఆడంబర ప్రదర్శన చేస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. తనపై వస్తున్న విమర్శలను ఎమ్మెల్యే పల్లవి ఖండించారు. పాప ఇంకా పసికందు కావడంతో ఇంట్లో ఒంటరిగా వదిలేసి రాలేకపోతున్నానని, అందుకే తనతో పాటు తెచ్చుకుంటున్నానని స్పష్టం చేశారు. "పసిపాపను వదిలి రాలేని పరిస్థితుల్లో ఒక తల్లి ఎదుర్కొనే బాధలను అర్థం చేసుకోకుండా ట్రోల్ చేయడం సరికాదు" అని హితవు పలికారు. ఒక వైపు తల్లిగా బిడ్డను సంరక్షించుకుంటూనే, మరోవైపు ప్రజాప్రతినిధిగా తన వృత్తిధర్మాన్ని నిష్పక్షపాతంగా నిర్వర్తి




స్తున్నానని, ఇందులో ఎటువంటి పబ్లిసిటీ స్టంట్ లేదా హడావిడి లేదని ఆమె తేల్చి చెప్పారు.

# భారత్‌లో ఉద్యోగ, వేతనాలపై ఇండీడ్ నివేదిక

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారతదేశంలో ప్రొఫెషనల్స్ పొందుతున్న ఉద్యోగ హోదాలకు , వారు అందుకుంటున్న జీతభత్యాలకు మధ్య పొంతన ఉండటం లేదని ప్రముఖ ఉద్యోగ వేదిక 'ఇండీడ్' నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ఆఫీసుల్లో ఇచ్చే గుర్తింపునకు, దానికి తగిన ఆర్థిక ప్రతిఫలానికి మధ్య భారీ వ్యత్యాసం పెరుగుతోందని నివేదిక స్పష్టం చేసింది. ప్రతి 10 మంది నిపుణులలో ఆరుగురు తమ ఉద్యోగ హోదాకు తగ్గ వేతనం రావడం లేదని స్పష్టం చేశారు. పరిశ్రమల్లో కేవలం పేర్లు మాత్రమే పెద్దవిగా ఉండే "ఫ్యాన్సీ" హోదాలు ఇవ్వడం సర్వసాధారణమైపోయిందని దాదాపు 80 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.



**జీతం పెరగదు.. కానీ హోదా మాత్రం సీనియర్ !**

గత రెండేళ్లలో మెరుగైన హోదా పొందిన ప్రతి ముగ్గురు ఉద్యోగులలో ఒకరికి జీతంలో అసలు ఎలాంటి పెంపు లేదని లేదా 5 శాతం కంటే తక్కువ పెంపు మాత్రమే లభించిందని సర్వే తేల్చింది. ఇదే సమయంలో 52 శాతం మంది నిపుణులు కొత్త ఉద్యోగాన్ని ఎంచుకునేటప్పుడు హోదా కంటే ఎక్కువ జీతానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కెరీర్ అసలు సిసలు విలువను జీతభత్యాలే నిర్ణయిస్తాయని మెజారిటీ ఉద్యోగులు స్పష్టం చేశారు. హోదా ముఖ్యమే.. కానీ ఆర్థిక పురోగతితోనే సంతృప్తి ఉద్యోగ హోదాలను నిపుణులు పూర్తిగా తోసిపుచ్చడం లేదు. హోదా అనేది భవిష్యత్ కెరీర్ అవకాశాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని 70 శాతం మంది భావించగా, కొత్త యజమానులు తమను చూసే దృక్పథాన్ని ఇది మెరుగుపరుస్తుందని 73 శాతం మంది చెప్పారు. ఉద్యోగ సంతృప్తిపై హోదా ప్రభావం ఉంటుందని 57 శాతం మంది పేర్కొన్నారు. హోదాలకు విలువ ఇస్తూనే, వాటికి తగిన ప్రతిఫలం, నిజమైన కెరీర్ పురోగతి తోడవ్వాలని ఉద్యోగులు ఆశిస్తున్నారు.

**యజమానుల వ్యత్యాస వ్యూహాలు**

ప్రతిభావంతులను ఆకర్షించడానికి లేదా సంస్థలో నిలుపుకోవడానికి 57 శాతం మంది యజమానులు సీనియర్ హోదాలను ఎరగా ఉపయోగిస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. జీతాల బడ్జెట్ పరిమితంగా ఉన్నప్పుడు సీనియర్ టైటిల్స్ ఇవ్వడమే సులువైన సాధనంగా కంపెనీలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 1,211 మంది యజమానులు, 2,533 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. కేవలం హోదాలు పెంచడమే కాకుండా, సమగ్ర కెరీర్ పురోగతిని ప్రతిబింబించినప్పుడే సంస్థలు సరైన ప్రతిభను నిలుపుకోగలవని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశి కుమార్ స్పష్టం చేశారు.

# టిస్ స్నాతకోత్సవం.. సీజేఐ స్థానంలో ముఖ్య అతిథి మార్పు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తమ 86వ స్నాతకోత్సవ ముఖ్య అతిథిని మార్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్థానంలో టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. గతంలో వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 22న ముంబైలోని డియోనార్ క్యాంపస్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**విద్యార్థుల నిరసనల ముప్పుతోనే వాయిదా?**

ఈ స్నాతకోత్సవం ఈ నెల 2న జరగాల్సి ఉండగా, కార్యక్రమానికి రెండు రోజుల ముందు హఠాత్తుగా



వాయిదా వేశారు. గతంలో నిరుద్యోగ యువతపై, విద్యార్థుల నిరసనలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన కొన్ని వ్యాఖ్యలను నిరసిస్తూ విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతాయనే ముందస్తు ఆందోళనతోనే సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆకస్మిక వాయిదాతో ఇబ్బంది పడిన విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు అయిన ఆర్థిక నష్టాన్ని భర్తీ చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది.

**షెడ్యూల్ బిజీగా ఉందన్న సీజేఐ కార్యాలయం**

గతంలో నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి కూడా ఆయనను ఆహ్వానించినప్పుడు విద్యార్థులు వ్యతిరేకించారు. మరోవైపు నవంబర్ వరకు తమ షెడ్యూల్ బిజీగా ఉన్నందున కొత్త తేదీల్లో స్నాతకోత్సవానికి హాజరు కాలేనని సీజేఐ కార్యాలయం టిస్ యాజమాన్యానికి స్పష్టం చేయడంతో ముఖ్య అతిథిని మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి...**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడం ఒక చారిత్రక నిర్ణయమని సీఎం అభివర్ణించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీలకు మొదటగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, దానిని 34 శాతానికి పెంచిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని గుర్తుచేశారు. బీసీలకు కేవలం పదవులు ఇవ్వడమే కాకుండా, నిర్ణయాధికారంలోనూ భాగస్వామ్యం కల్పిస్తూ బలమైన నాయకత్వాన్ని అందించామన్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీల నుంచి ఎంపీల వరకు బీసీ నేతలను ప్రోత్సహించామని, సామాన్య ఎంపీటీసీ సభ్యుడైన నాగరాజును కర్నూలు ఎంపీగా గెలిపించిన ఘనత కూటమిదేనని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని చంద్రబాబు మండిపడ్డారు. 2019లో బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని నాటకాలు ఆడిన జగన్ ప్రభుత్వం, హైకోర్టు ఆ ఉత్తర్వులను తిరస్కరిస్తే సుప్రీంకోర్టులో కనీసం పిటిషన్ కూడా వేయకుండా చేతులెత్తేసిందని విమర్శించారు. బీసీల రాజకీయ పురోగతిని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు.రాష్ట్రంలో స్థిరమైన పాలన అందించేందుకే స్థానిక సంస్థల్లో ఈ రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. బీసీల రిజర్వేషన్ల కల్పనపై వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఆ కేసులను ఎదుర్కొనేందుకు టీడీపీ , కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని సూచించారు. బీసీలకు చట్టపరమైన రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో దక్కాలని, బీసీ రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టులకు వెళ్తే వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని సీఎం తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

# మహనీయులు పాడిన గేయాన్నే మేమూ పాడాం...

**మొదటిపేజీ తరువాయి...**

"అప్పట్లో ఆ మహనీయులు పాడిన గేయాన్ని ఇప్పుడు మేము పాడటం నేరమే అయితే.. ముందుగా ఆ దివంగత నేతలపై కేంద్ర ప్రభుత్వం కేసులు నమోదు చేయాలి" అని ఖర్గే సవాల్ విసిరారు. గాంధీ, నెహ్రూ, పటేల్ జన్మించకముందే జాతీయ గేయాలు ఏవో నిర్ణయిస్తూ కాంగ్రెస్ ఒక తీర్మానాన్ని ఆమోదించిందని ఆయన గుర్తుచేశారు. "మీరు (బీజేపీ) చెప్పిందే ఎప్పటికీ జాతీయ ప్రమాణికం అయిపోదు. ఇలాగైతే రేపు మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చెప్పేది కూడా రూల్ అయిపోవచ్చు. 90 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో వస్తున్న ఆనవాయితీనే మేమూ కొనసాగిస్తున్నాం" అని ఖర్గే స్పష్టం చేశారు.

**స్వాతంత్ర్య పోరాటంలో మీ పాత్ర ఏంటి?**

దక్షిణ గోవాలో తాజాగా జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్న ఖర్గే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు భారత స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏంటో దేశ ప్రజలకు చెప్పాలని ఆయన సవాలు విసిరారు. గోవాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేసి బీజేపీ అక్రమంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని ఆయన దుయ్యబట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపన జరుగుతున్న సమయంలో.. మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ మాట్లాడుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై బీజేపీ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అగ్రనేతలు జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడిన కమలనాథులు.. దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఖర్గే పైవిధంగా దీటుగా బదులిచ్చారు.



# నల్గొండ కార్యకర్తలే కాంగ్రెస్‌కు వెన్నెముక

**మొదటిపేజీ తరువాయి...**

**జెండా మోసిన వారికి సెల్యూట్**

ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సామాన్య కాంగ్రెస్ కార్యకర్తల సేవలను ఉత్తమ్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి నల్గొండ కార్యకర్తలు తెలంగాణ కాంగ్రెస్‌కు వెన్నెముక, ఆత్మ అని ఆయన అభివర్ణించారు. గత పదేళ్ల కష్టకాలంలో, ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ.. వేలాది మంది కార్యకర్తలు అచంచలమైన ధైర్యం, నిబద్ధతతో కాంగ్రెస్ జెండాను గుండెలకు హత్తుకుని కాపాడారని కొనియాడారు.

**ఇది కార్యకర్తల పోరాట విజయం**

ఈ రోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం కేవలం ఒక సాధారణ ఎన్నికల విజయం మాత్రమే కాదని, అది అసంఖ్యాకమైన కార్యకర్తలు చేసిన నిరంతర పోరాటానికి దక్కిన ప్రతిఫలమని ఉద్ఘాటించారు. పార్టీ కోసం కార్యకర్తలు పడిన కష్టాలు, వారి కుటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీ పట్ల వారు చూపిన అచంచల విశ్వాసమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు.కష్టకాలంలో పార్టీని వీడకుండా, ఏళ్ల తరబడి జెండా మోసిన ప్రతి విశ్వసనీయ కార్యకర్తకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత గౌరవం, గుర్తింపు, తగిన అవకాశాలు దక్కుతాయని ఉత్తమ్ గట్టి భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి కార్యకర్తల త్యాగాలకు ఆయన హృదయపూర్వక నివాళులర్పించడం, పదవులపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం వెల్లువెత్తింది.

# అధికారం శాశ్వతం కాదు మర్చిపోవద్దు

**మొదటిపేజీ తరువాయి...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పు కోసం పోలీసులు వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టిన కేటీఆర్.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు, ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ ఆందోళనలు చేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం, గృహనిర్బంధాలు విధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్ర పాలన నాటి కర్కశత్వాన్ని ప్రదర్శిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. శాసనసభ విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులను పోలీసులు అడ్డుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరినీ ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా వెంటనే విడుదల చేయాలని, పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యుల మనోధైర్యాన్ని ఇలాంటి తుగ్లక్ చేష్టలతో దెబ్బతీయకూడదని కేటీఆర్ హితవు పలికారు. ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య నిరసనలను అణచివేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేసిన ఆయన, ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ముమ్మాటికి రాష్ట్రంలో ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్.. ఆ సమయంలో నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టుకోవడంతో పాటు ఆయన వీరోచిత పోరాటానికి శాశ్వత కీర్తిని తీసుకువస్తామని పునరుద్ఘాటించారు.



# ఆహా.. ఎలక్ట్రిక్ విమానం వచ్చేసింది

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

స్వీడన్ సంస్థ హార్ట్ ఏరోస్పేస్ అరుదైన మైలురాయి సాధించింది. ఎలక్ట్రిక్ విమానయాన రంగంలో చారిత్రాత్మక ముందడుగు పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద పూర్తిస్థాయి బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ విమానం తొలి ప్రయోగాత్మక ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. స్వీడన్‌కు చెందిన 'హార్ట్ ఏరోస్పేస్' అభివృద్ధి చేసిన 30 సీట్ల సామర్థ్యం గల 'X1' విమానం కేవలం బ్యాటరీ విద్యుత్‌తోనే 27 నిమిషాల పాటు గాల్లో విహరించింది. న్యూయార్క్‌లోని ప్లాట్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగంలో ఎలాంటి ప్రయాణికులు లేకుండా కేవలం పైలట్ మాత్రమే విమానాన్ని నడిపారు. దాదాపు 25,000 పౌండ్ల బరువు, 106 అడుగుల రెక్కల విస్తీర్ణం కలిగిన ఈ విమానం 1,100 అడుగుల ఎత్తు వరకు వెళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది.

**27 నిమిషాల ప్రయాణానికి రూ.400 విద్యుత్ బిల్లు**


ఈ ప్రయోగాత్మక ప్రయాణంలో అత్యంత ఆసక్తికరమైన అంశం దాని ఇంధన ఖర్చు. 27 నిమిషాల ప్రయాణానికి విమానం వినియోగించిన విద్యుత్‌కు అయిన ఖర్చు సుమారు 5 డాలర్లు (భారత కరెన్సీలో రూ.400 450) మాత్రమేనని కంపెనీ వెల్లడించింది. ఇది కేవలం విద్యుత్ ఛార్జీ మాత్రమే అయినప్పటికీ, సాంప్రదాయ జెట్ ఇంధనంతో పోలిస్తే విమాన నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని స్పష్టమవుతోంది. వాణిజ్య విమానాల స్థాయిలో ఎలక్ట్రిక్ ప్రయాణం సాధ్యమేనని ఈ ఫ్లైట్ నిరూపించిందని కంపెనీ సీఈఓ అండర్స్ ఫోర్స్ లండ్ ఆనందం వ్యక్తం చేశారు.

**భవిష్యత్తులో తగ్గనున్న ప్రయాణ చార్జీలు**


ప్రస్తుతం బ్యాటరీ బరువు, ప్రయాణించగల దూరం (రేంజ్) వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ ప్యాసింజర్ విమానాలు అందుబాటులోకి వస్తే విమాన చార్జీలు భారీగా తగ్గే అవకాశం ఉంది. పెరిగే ఇంధన ధరల భారం లేకుండా, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణం చేసే రోజులు అతి సమీపంలోనే ఉన్నాయని ఈ ప్రయోగం స్పష్టం చేస్తోంది.

# ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రికి తరలించండి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ (పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. జైలులో ఉన్న ఆయన ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుండటంతో, తక్షణమే ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని సుప్రీం కోర్టు ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను చూపిస్తూ ఆయన కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానం ఆదేశాలను పీటీఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ముందే తీసుకొని ఉంటే ఇమ్రాన్ ఆరోగ్యం ఇంతగా దెబ్బతినేది కాదని అభిప్రాయపడ్డారు. ఆయన పూర్తిగా కోలుకునే వరకు ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిపుణులైన వైద్యులతో కలిసి తాను నివేదికలను పరిశీలించానని, ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణిస్తోందని వారు నిర్ధారించారని తెలిపారు. మూడేళ్ల జైలు జీవితం, సుదీర్ఘ ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక,శారీరక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. "నాకు ఇమ్రాన్ ఖాన్ 35 ఏళ్లకు పైగా తెలుసు. రాజకీయాల్లో ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా ఆయన ఎప్పుడూ ఒత్తిడికి లోనుకాలేదు. కానీ గత ఏడు నెలలుగా కుటుంబానికి, పార్టీ శ్రేణులకు దూరంగా ఉంచడం, బయట ఏం జరుగుతుందో సమాచారం లేకపోవడంతో ఆయన తీవ్రంగా కుంగిపోయారు," అని అల్వీ వెల్లడించారు.మరోవైపు ఇమ్రాన్ ఖాన్‌ను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీటీఐ శ్రేణులు, మద్దతుదారులు పాకిస్తాన్ వ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టారు. తోషాఖానా, అల్‌ఖాదిర్ ట్రస్ట్ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం రావల్పిండిలోని ఆడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే.



# క్షిపణి దాడులపై యూఏఈ వార్నింగ్


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మళ్లీ అల్లుకుంటున్న పరిణామాల్లో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం తమ పౌరులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. దేశంపై క్షిపణి దాడులు జరిగే ముప్పు ఉన్నట్లు గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించాయని వెల్లడించింది. ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అధికార వర్గాల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూఏఈ రక్షణ శాఖ, నేషనల్ ఎమర్జెన్సీ క్రైసిస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఉమ్మడిగా అత్యవసర అడ్వైజరీని విడుదల చేశాయి. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతున్న నేపథ్యంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెరికా-ఇరాన్‌ల మధ్య కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందం గడువు ఈ నెల 17తో ముగియడంతోనే యూఏఈ ఈ విధమైన క్షిపణి హెచ్చరిక జారీ చేయడం తీవ్ర ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. తీవ్ర ఆందోళనలో గల్ఫ్ ప్రజలు ఉన్న క్రమంలో ఒప్పందం ముగియడం, రెండు దేశాల మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరే అవకాశం ఉండటంతో గల్ఫ్ ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ దళాలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నాయని, పౌరులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని యూఏఈ యంత్రాంగం స్పష్టం చేసింది.

# మక్కా వెళ్లాలంటే.. సౌదీ రూల్స్ పాటించాల్సిందే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పవిత్ర మక్కా నగరంలో ఉమ్రా పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లే ముస్లిం సోదరులకు సౌదీ అరేబియా ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఏడాది పాటు ఎన్నిసార్లయినా ప్రయాణించే వెసులుబాటు ఇచ్చే 'వన్ ఇయర్ మల్టిపుల్ ఎంట్రీ ఉమ్రా వీసా' ఉన్నప్పటికీ, నేరుగా విమానం ఎక్కి వచ్చేస్తే సౌదీలోకి అనుమతించరని స్పష్టం చేసింది. చెల్లుబాటయ్యే వీసా ఉన్న ప్రతీసారి ప్రయాణించే ముందు కొత్తగా సర్వీస్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక అనుమతి పత్రాన్ని (పర్మిట్) తీసుకోవడం తప్పనిసరి చేస్తూ సౌదీ హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలు జారీ చేసింది.



**'నుసుక్' యాప్ ద్వారా బుకింగ్**

కొత్త నిబంధనల ప్రకారం భక్తులు ప్రతి పర్యటనకూ ముందుగా 'నుసుక్' పోర్టల్ ద్వారా గుర్తింపు పొందిన ఏజెన్సీల నుంచి బస, రవాణా సౌకర్యాలతో కూడిన సర్వీస్ ప్యాకేజీని బుక్ చేసుకోవాలి. దీనితో పాటు నుసుక్ యాప్ ద్వారా ప్రత్యేక ఉమ్రా పర్మిట్ పొందిన తర్వాతే ప్రయాణించాల్సి ఉంటుంది. తొలిసారి వీసా దరఖాస్తు చేసుకునేవారు కూడా ముందుగా ప్యాకేజీ కొనుగోలు చేసిన తర్వాతే వీసా ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

**ఏడాదిలో గరిష్ఠంగా 90 రోజులే అనుమతి**

ఏడాది కాలపరిమితి వీసా ఉన్నప్పటికీ, అన్ని పర్యటనలు కలిపి గరిష్ఠంగా 90 రోజులు మాత్రమే సౌదీలో ఉండటానికి అనుమతి ఉంటుందని అధికారులు తేల్చి చెప్పారు. ఏడాది వీసా అనేది కేవలం వచ్చి వెళ్లేందుకు ఇచ్చిన వెసులుబాటు మాత్రమేనని, భక్తులకు వసతి, రవాణా ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ ముందస్తు ప్యాకేజీ నిబంధన తెచ్చామని వెల్లడించారు. కాబట్టి ప్రయాణానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సౌదీ ప్రభుత్వం సూచించింది.

# గల్ఫ్‌లో శత్రువులుగా మారిన ప్రాణ స్నేహితులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మక్కా ఒప్పందంతో రాజుకున్న దౌత్య రగడ గల్ఫ్ రాజకీయాల్లో ఒకప్పుడు అత్యంత సన్నిహిత మిత్రులుగా ఉన్న సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య దశాబ్దాల మైత్రికి బీటలు వారుతోంది. ఈ నెల 7న పవిత్ర మక్కా నగరంలో కుదిరిన చారిత్రాత్మక సైనిక ఒప్పందం పశ్చిమాసియాలో సరికొత్త యుద్ధ మేఘాలను, తీవ్ర దౌత్య విభేదాలను రాజేసింది. అణుశక్తి సంపన్న పాకిస్తాన్ , నాటోలో రెండో అతిపెద్ద సైనిక బలగం కలిగిన టర్కీలతో కలిసి సౌదీ అరేబియా 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్'పై సంతకాలు చేసింది. 'ఇస్లామిక్ నాటో'గా పిలువబడుతున్న ఈ కూటమిలోని ఏదైనా ఒక దేశంపై దాడి జరిగితే, అది మిగిలిన రెండు దేశాలపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు. ఈజిప్ట్, ఖతార్, కువైట్, జోర్డాన్, అజర్‌బైజాన్, సిరియా వంటి దేశాలను కూడా ఈ కూటమిలోకి లాగేందుకు సౌదీ ప్రణాళికలు రచిస్తోంది.



**సౌదీ నిర్ణయంపై యూఏఈ ఆగ్రహం**

ఈ ఒప్పందంపై సంతకాల సిరా ఆరకముందే యూఏఈ నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. 1981లో ఏర్పాటైన 6 దేశాల 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్' (జిసిసి) ఇప్పటికే ఉమ్మడి రక్షణ వ్యవస్థను, సైనిక కమాండ్‌ను కలిగి ఉందని ఎమిరాటీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. జిసిసి ఉండగా బయటి శక్తులైన పాకిస్తాన్ , టర్కీలతో సౌదీకి ప్రత్యేక రక్షణ కూటమి ఎందుకు అవసరమైందని యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ మాజీ సలహాదారు అబ్దుల్ ఖలేక్ అబ్దుల్లా ఘాటుగా ప్రశ్నించారు. గల్ఫ్ ఉమ్మడి ఇంటిని చక్కబెట్టుకోవడం కంటే ఈ కొత్త కూటమి ముఖ్యమా అంటూ ఆయన నిలదీశారు. యూఏఈ-భారత్, ఇజ్రాయెల్ బంధంపై సౌదీ కౌంటర్ యూఏఈ అభ్యంతరాలపై సౌదీ అరేబియా గట్టిగానే ఎదురుదాడి చేసింది. జాతీయ ప్రయోజనాల కోసం ఏ దేశమైనా ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకునే హక్కు ఉంటుందని సౌదీ ప్రిన్స్ అబ్దుల్ రెహమాన్ బిన్ ముసైద్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ఏ దేశానికీ వ్యతిరేకం కాదని, కేవలం సమష్టి రక్షణ కవచం మాత్రమేనని రియాద్‌లోని అస్బార్ సెంటర్ పేర్కొంది. మరోవైపు, సౌదీ మేధావులు యూఏఈ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. 2020లో అబ్రహం ఒప్పందాల ద్వారా ఇజ్రాయెల్‌తో చేతులు కలిపినప్పుడు, అలాగే ఇరాన్ క్షిపణి దాడుల నుంచి రక్షణకు ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీని యూఏఈ గడ్డపై మోహరించినప్పుడు గల్ఫ్ దేశాల అనుమతి తీసుకున్నారా అని అబ్దుల్ అజీజ్ అల్‌తువైజ్రీ నిలదీశారు. భారత్‌తో యూఏఈ కుదుర్చుకున్న 'స్ట్రాటజిక్ డిఫెన్స్ పార్టనర్‌షిప్' రక్షణ బంధాన్ని కూడా సౌదీ వర్గాలు వేలెత్తి చూపుతున్నాయి.

**పశ్చిమాసియాలో ఆధిపత్య పోరు**

యెమెన్ అంతర్యుద్ధంలో సౌదీ అరేబియా అక్కడ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతు ఇస్తుండగా, యూఏఈ మాత్రం వేర్పాటువాద సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్‌కు అండగా నిలుస్తోంది. ఒకవైపు టర్కీ-పాకిస్తాన్‌ల అండతో కొత్త ఇస్లామిక్ రక్షణ కూటమిని సౌదీ అరేబియా నిర్మించుకుంటోంటే, మరోవైపు భారత్, ఇజ్రాయెల్ వంటి అంతర్జాతీయ శక్తులతో యూఏఈ భద్రతా బంధాన్ని పటిష్టం చేసుకుంటోంది. ఈ రెండు గల్ఫ్ అగ్రరాజ్యాల మధ్య పెరుగుతున్న ఆధిపత్య పోరు సాంప్రదాయ గల్ఫ్ ఐక్యతను తీవ్రంగా దెబ్బతీసేలా కనిపిస్తోంది.

# అమెరికా, ఇజ్రాయెల్‌పై భారీ యుద్ధానికి స్కెచ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

యుద్ధ సన్నాహాలకు వినియోగం అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత లభించిన విరామ కాలాన్ని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఒక భారీ యుద్ధానికి సిద్ధమయ్యేందుకు వాడుకుందని అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. అమెరికా-ఇజ్రాయెల్ పెద్ద దాడికి సమయం కోసం చూస్తున్నాయని అంచనా వేసిన ఇరాన్ నాయకత్వం ఈ కాలాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంది. శత్రు భూభాగాలపై ముందస్తు దాడులు, ఇతర సైనిక చర్యల కోసం ఇరాన్ పక్కా ప్రణాళికలు రూపొందించినట్లు ఇరాన్, అరబ్ అధికారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఈ సమయంలో క్షిపణుల ఉత్పత్తిని వేగవంతం చేయడం, వాటి కచ్చితత్వాన్ని పెంచడం, డ్రోన్ల తయారీని పెంచడం, కౌంటర్ ఇంటెలిజెన్స్ కార్యకలాపాలను విస్తరించడం వంటి చర్యలు చేపట్టింది. అమెరికా అధ్యక్షుడితో ఒప్పందం వల్ల ఉద్రిక్తతలు తగ్గుతాయని వాషింగ్టన్ భావించింది.



**కీలక పదవుల్లో సైనిక అధికారుల నియామకం**

మహా ఘర్షణను ఎదుర్కొనేందుకు వీలుగా ఇరాన్ సాధారణ సైన్యంపై ఐఆర్‌జీసీ పర్యవేక్షణను పెంచింది. సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ భద్రతా వ్యవస్థలో పెద్ద మార్పులు చేస్తూ.. ఇరాన్-ఇరాక్ యుద్ధ అనుభవజ్ఞులను, సీనియర్ అధికారులను కీలక పదవుల్లో నియమించారు. కొత్త ఐఆర్‌జీసీ కమాండర్ ఇన్ చీఫ్ అహ్మద్ వాహిదీ శత్రువులపై శక్తిమంతమైన దాడులు నిర్వహించే బాధ్యతను స్వీకరించగా, సైన్యం శత్రు భూభాగంలోకి దూసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సలహాదారు జనరల్ మహ్మద్ రెజా నగ్దీ ప్రకటించారు. ప్రాంతీయంగా ఉన్న తమ అనుబంధ సాయుధ ముఠాలతో వ్యూహాత్మక సమన్వయాన్ని ఇరాన్ బలపరిచింది.

**ఎర్ర సముద్రంలో మోహరింపులు.. మిత్రదేశాలపై దాడులు**

ఇరాక్, యెమెన్, లెబనాన్‌లలో దాడుల ప్రణాళికలపై ఇరాన్ కమాండర్లు చర్చించారు. ఎర్ర సముద్రం వైపు క్షిపణులు, నౌకాదళ ఆయుధాలు, డ్రోన్ లాంచర్లను ఐఆర్‌జీసీ మోహరించింది. సౌదీ అరేబియాలోని రేవులు, ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి యెమెన్ ఉగ్రవాదులకు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని, టార్గెట్ లిస్టులను అందించింది. దీని ఫలితంగా సౌదీ ఇంధన మౌలిక సదుపాయాలపై, జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగాయని అంతర్జాతీయ కథనాలు తెలిపాయి.

**సముద్రగర్భ కేబుళ్ల విధ్వంసానికి కొత్త వ్యూహాలు**

సైనిక ఉద్రిక్తతలను మరింత పెంచడానికి ఐఆర్‌జీసీ కొత్త ప్లాన్లు సిద్ధం చేసింది. ఇందులో ముందస్తు దాడులు, పర్షియన్ గల్ఫ్‌లోని సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుళ్ల విధ్వంసం, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాల్లోని షియా కమ్యూనిటీల ద్వారా రాజకీయ అశాంతిని రేకెత్తించడం వంటి వ్యూహాలు ఉన్నాయి. మే నెల ప్రారంభంలో ఒక అద్దె ఫిషింగ్ బోటు ద్వారా కువైట్ ద్వీపంలోకి ప్రవేశించిన ఆరుగురు ఐఆర్‌జీసీ సిబ్బందిని కువైట్ భద్రతా దళాలు అడ్డుకున్నాయి. ఆర్థిక క్షీణత, అమెరికా ఆంక్షల వల్ల దేశంలో అంతర్గత నిరసనలు వ్యక్తమయ్యే అవకాశం ఉండటంతో ఇరాన్ నాయకత్వం అంతర్గత భద్రతను కూడా మరింత కఠినతరం చేసింది.

# 'ఆపరేషన్ సిందూర్' డాక్యుమెంటరీపై పాక్ ఆర్మీ ఫైర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆపరేషన్ సిందూర్ పై భారతదేశం రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీపై పాకిస్తాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. డిస్కవరీ ఛానల్ ప్రసారం చేసిన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" డాక్యుసిరీస్ క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి, భారత్‌కు అనుకూలంగా ఏకపక్షంగా, నాటకీయంగా చిత్రీకరించారని పాకిస్తాన్ సైనిక మీడియా విభాగం (ఐఎస్‌పీఆర్) ఆరోపించింది. రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్‌లో భారత సీనియర్ సైనిక, రాజకీయ నాయకులు ఆపరేషన్ వెనుక ఉన్న వ్యూహాలను వివరించారు. ఈ సందర్భంగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాట్లాడుతూ.. భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని చేతగానితనంగా భావిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన వారిని మట్టికరిపించడమే లక్ష్యంగా 88 గంటల పాటు ఈ ఆపరేషన్ సాగిందని ఆయన పేర్కొన్నారు.

**పహల్గామ్ దాడికి భారత్ కౌంటర్**

గతేడాది ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్తాన్ , పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. దాదాపు 88 గంటల పాటు రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగగా, మే 10న రెండు పక్షాల మధ్య అవగాహన కుదరడంతో ఈ సైనిక చర్య ముగిసింది. భారత సైనికులు శత్రువుల స్థావరాలను ధ్వంసం చేసి విజయం సాధించడాన్ని డాక్యుమెంటరీలో వివరించగా, దానిని సైనిక విజయంగా అభివర్ణించడాన్ని పాక్ వ్యతిరేకిస్తోంది.

**ఐఎస్ఐ నెట్‌వర్క్ గుట్టురట్టుపై పాక్ విమర్శలు**

మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై కూడా పాకిస్తాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. దేశంలో నెలకొన్న అంతర్గత భద్రతా సవాళ్ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే భారత్ తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ISI మద్దతు ఉన్న ఉగ్ర నెట్‌వర్క్‌ను భారత్ ఛేదించిందన్న వ్యాఖ్యలను పాక్ ఖండించింది.

**దేశవ్యాప్తంగా 200 మంది ఉగ్రవాదుల అరెస్ట్..**

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ఐఎస్ఐ మద్దతు ఉన్న 'షెహజాద్ భట్టి నెట్‌వర్క్'కు చెందిన 200 మందికి పైగా కార్యకర్తలను దేశవ్యాప్తంగా అరెస్ట్ చేసినట్లు అమిత్ షా వెల్లడించారు.



14 రాష్ట్రాల్లో భద్రతా బలగాలు సమన్వయంతో సోదాలు నిర్వహించి ఈ నెట్‌వర్క్‌ను ఛేదించాయి. వీరి నుంచి పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మార్కింగ్‌తో ఉన్న ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టల్స్, సీసీటీవీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 62, హరియాణాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మంది సహా పలు రాష్ట్రాల్లో అరెస్టులు నమోదయ్యాయి. ఇటీవల పంజాబ్, హరియాణాల్లో జరిగిన పేలుళ్లు, లక్షిత హత్యల వెనుక ఈ నెట్‌వర్క్ ప్రమేయం ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానానికి ఈ చర్య నిదర్శనమని భద్రతా సంస్థలు స్పష్టం చేశాయి.

# అమెరికాలో హర్మూజ్ అంతర్భాగమే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హర్మూజ్ జలసంధి అమెరికాలో అంతర్భాగం అంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త వివాదానికి తెరలేపారు. ఈ జలసంధిని "కొత్త అమెరికా భూభాగం"గా అభివర్ణిస్తూ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'ని ఏకంగా అమెరికా అధికారిక మ్యాప్‌లోనే చేర్చారు. హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, నేవీ దిగ్బంధం ద్వారా దానిని తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధ వాతావరణంలో ట్రంప్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ సైతం అంతే ఘాటుగా స్పందించింది. హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను వెంటనే పునరుద్ధరించే ప్రసక్తి లేదని ఇరాన్ నేత మహమ్మద్ ఘాలీబాఫ్ తేల్చి చెప్పారు. తాత్కాలిక శాంతి ఒప్పందంలో ఇచ్చిన హామీలను అమెరికా నెరవేర్చే వరకు జలసంధిని తెరిచేది లేదని స్పష్టం చేశారు. అమెరికా వెంటనే తమ నేవీ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, ఇరాన్‌పై విధించిన చమురు ఆంక్షలను తొలగించడమే కాకుండా విదేశాల్లో నిలిపివేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



**ప్రపంచ ఇంధన భద్రతకు విఘాతం**

ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం ఆయిల్, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం వాటా ఒక్క హర్మూజ్ జలసంధి గుండానే సాగుతుంది. ఈ ప్రాంతంలో రెండు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రతరం కావడంతో నౌకల రవాణా పూర్తిగా నిలిచిపోయి, అంతర్జాతీయంగా తీవ్ర ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఏర్పడింది. అమెరికా హెచ్చరికలను లెక్కచేయకుండా ఇరాన్ పట్టుదలతో ఉండటంతో పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి.




# భారత్ -బంగ్లా-చైనా మధ్యలో 'తీస్తా' రగడ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల నడుమ దశాబ్దాలుగా నలుగుతున్న తీస్తా నదీ వివాదం మళ్లీ ఉద్రిక్తతలకు దారితీస్తోంది. చైనా ఆర్థిక, సాంకేతిక సహకారంతో 'తీస్తా సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టు'ను పూర్తిచేయాలని బంగ్లాదేశ్ కంకణం కట్టుకోవడం భారత్‌తో మైత్రిని పణంగా పెట్టడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఢాకాలో జరిగిన ఒక సెమినార్‌లో బంగ్లాదేశ్ జలవనరుల శాఖ మంత్రి షాహిదుద్దీన్ చౌదరి మాట్లాడుతూ.. భారత్‌తో సంబంధాలను తెంచుకోవాలని తమ దేశం భావించడం లేదని, అయితే నదీ జలాల విషయంలో తమ ప్రయోజనాలను కూడా భారత్ మిత్రభావంతో పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఉత్తర బంగ్లాదేశ్‌కు జీవనాడి**

సిక్కిం, పశ్చిమ బెంగాల్ మీదుగా బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించే తీస్తా నది.. ఉత్తర బంగ్లాదేశ్‌లోని ఐదారు జిల్లాల వ్యవసాయం, సాగునీరు, ప్రజల జీవనోపాధికి అత్యంత కీలకం. నదీ కోత, వరదలు, వేసవి నీటి కొరతతో అల్లాడుతున్న లక్షలాది కుటుంబాల కోసం చైనా సాయంతో ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని బంగ్లా ప్రభుత్వం నిర్ణయించింది. చైనా పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ఈ ప్రాజెక్టు సాంకేతిక అధ్యయనాన్ని వేగవంతం చేయడంపై చైనా నాయకత్వంతో చర్చలు జరిపారు.

**దశాబ్దాలుగా తేలని జల వివాదం**

1983 నాటి మధ్యంతర ఒప్పందం ప్రకారం తీస్తా నీటిలో 39 శాతం భారత్‌కు, 36 శాతం బంగ్లాదేశ్‌కు కేటాయించి, మిగిలిన 25 శాతాన్ని కేటాయించకుండా వదిలేశారు. 2011లో ఒప్పంద ఖరారుకు రెండు దేశాలు సిద్ధమైనప్పటికీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీవ్ర అభ్యంతరాల వల్ల అది ముందుకు సాగలేదు. వ్యూహాత్మకంగా సున్నితమైన సరిహద్దు ప్రాంతంలో చైనా ప్రాజెక్టులు చేపట్టడం భారత్‌కు నచ్చకపోయినా.. బంగ్లాదేశ్ మాత్రం తమ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్తుండటం దౌత్య వర్గాల్లో కలకలం రేపుతోంది.



# కుర్దు మిలిటెంట్లకు టర్కీ క్షమాభిక్ష

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

వేలాది మంది కుర్దిష్ మిలిటెంట్లకు షరతులతో కూడిన క్షమాభిక్ష ప్రసాదించే చట్టంపై అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ సంతకం చేశారు. కుర్దిస్థాన్ వర్కర్స్ పార్టీ (పీపీకే)తో దశాబ్దాలుగా కొనసాగుతున్న సాయుధ పోరాటానికి తెరదించే దిశగా టర్కీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ చట్టం అధికారిక గెజిట్‌లో కూడా ప్రచురితమైంది. పీపీకే మిలిటెంట్లు పూర్తిగా నిరాయుధులయ్యారని టర్కీ సెక్యూరిటీ కౌన్సిల్ నిర్ధరించిన తర్వాతే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**శిక్షల రద్దు.. కేసుల వాయిదా**

తమ హక్కుల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న కుర్దులను అణచివేసే ప్రయత్నం చేసిన టర్కీ ప్రభుత్వం, ఇటీవల వారితో శాంతి చర్చలు ప్రారంభించింది. ఈ ప్రక్రియలో భాగంగా పార్లమెంటు కూడా ఒక ప్రత్యేక బిల్లుకు ఆమోదం తెలిపింది. నేర తీవ్రతను బట్టి పీపీకే సభ్యుల శిక్షలను నిలిపివేయడం, ప్రస్తుతం కొనసాగుతున్న విచారణలను ఐదు నుంచి పదేళ్ల పాటు వాయిదా వేయడం వంటి చర్యలను చేపట్టనున్నారు. ఈ వాయిదా వ్యవధిలో మిలిటెంట్లు మళ్లీ ఎలాంటి నేరాలకు లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉంటే, వారిపై ఉన్న కేసులను పూర్తిగా ఎత్తివేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా పశ్చిమాసియాలో దశాబ్దాలుగా నలుగుతున్న కుర్దిష్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# యూఎస్‌లోనూ ఐడీ అమలు చేద్దాం...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



అమెరికా ఎన్నికల వ్యవస్థలో కఠిన సంస్కరణలు తీసుకురావాలనే తన డిమాండ్‌కు మద్దతుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎన్నికల తీరును ఉదాహరణగా ప్రస్తావించారు. ఈ నెల ప్రారంభంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తమ యంత్రాంగాన్ని ఉద్దేశించి "చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడీ లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారు?" అని ప్రశ్నించినట్లు ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా వెల్లడించారు. అమెరికాలో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉండాలని, ఇందుకోసం 'SAVE అమెరికా యాక్ట్' (సాఫ్‌గార్డ్ అమెరికన్ వోటర్ ఎలిజిబిలిటీ) బిల్లును యూఎస్ కాంగ్రెస్ తక్షణమే ఆమోదించాలని కోరారు.

**భారత సార్వత్రిక ఎన్నికల గణాంకాలతో పోలిక**

భారత్‌లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారని, అక్కడ ప్రతి ఓటరు వద్ద చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు ఉందో లేదో తనిఖీ చేస్తారని ట్రంప్ గుర్తుచేశారు. భారత్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం కేవలం ఒక శాతానికంటే తక్కువగా ఉందన్న విషయాన్ని ఆయన ఎత్తిచూపారు. ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతుగా భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందిస్తూ.. ట్రంప్ చెప్పిన మాటలు అక్షరాలా నిజమని, 646 మిలియన్ల మంది ఓటర్లు ఉన్న భారత్ ప్రతి ఒక్కరికీ ఐడీని విధిగా అమలు చేస్తోందని వ్యాఖ్యానించారు.

**ఏమిటీ సేవ్ అమెరికా యాక్ట్..?**

అమెరికాలో ఫెడరల్ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకునేటప్పుడు ఓటర్లు తమ పౌరసత్వానికి సంబంధించిన భౌతిక ఆధారాలను సమర్పించడాన్ని తప్పనిసరి చేయడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం అమెరికాలో ఓటర్ ఐడీ, పోస్టల్ బ్యాలెట్ నిబంధనలు రాష్ట్రాలవారీగా భిన్నంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఒకే విధమైన కఠిన నిబంధనలు తేవడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చని ట్రంప్ స్పష్టం చేశారు.

సంక్షిప్త మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
19.08.2026
www.manasarkar.com



# లోకేశ్ ఆహ్వానిస్తే జగన్ తప్పించుకుంటున్నారు

**కర్నూలు (ఏడీఎన్ఎన్) :**

శాసనసభలో డీఎస్సీ 2025పై సమగ్ర చర్చకు రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరితే.. సమాధానం చెప్పలేక వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పించుకుని తిరుగుతున్నారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ విసిరిన సవాల్‌ను స్వీకరించి, అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని జగన్‌కు ఆయన స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న 'డ్రోన్ సిటీ'మంగళవారం సందర్శనకు వచ్చిన సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీకి వస్తే గత ప్రభుత్వంలో చేసిన కుట్రలు, అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే వైఎస్ జగన్ చర్చకు ముఖం చాటేస్తున్నారని రామ్మోహన నాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ కేవలం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద డ్యూటీలలో నిలబెట్టి అవమానించిన చరిత్ర జగన్‌దని, ఆయనకు టీచర్లంటేనే కక్ష, కోపమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఊహించని రీతిలో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లులో నూతనంగా రూపుదిద్దుకుంటున్న డ్రోన్ సిటీ ప్రాంగణంలో దాదాపు 150 డ్రోన్ తయారీ సంస్థల సీఈఓలు, ప్రతినిధులతో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీకి దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రానుందని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 6 లక్షల డ్రోన్ల అవసరం ఉండగా, కేవలం 40 వేల డ్రోన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఈ రంగాన్ని వేగంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌కు ఆకర్షితులై అనేక దిగ్గజ డ్రోన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు.ఓర్వకల్లులో 600 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఈ డ్రోన్ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, పరిశోధనలతో పాటు శిక్షణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వదేశీ డ్రోన్ సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారని, విదేశీ డ్రోన్ల దిగుమతిపై ఇప్పటికే నిషేధం విధించామని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రం, భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ హబ్‌గా నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు స్పష్టం చేశారు.



# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల ఖరారు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సామాజిక సమతుల్యత పాటిస్తూ ఎస్సీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి పేర్లను ప్రభుత్వం తుది జాబితాగా ఖరారు చేసింది. ఈ మేరకు స్థానాల భర్తీకి సంబంధించిన దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించినట్లు సమాచారం.

# టీడీపీకి కాపు కాయడానికి జనసేన పెట్టలేదు

**కాకినాడ (ఏడీఎన్ఎన్) :**



తెలుగుదేశం పార్టీతో నిరంతరం కలసి పయనించడానికే జనసేన పార్టీని స్థాపించలేదని, పవన్ కళ్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని చేయడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ స్పష్టం చేశారు. టీడీపీకి నిరంతరం కాపు కాయడానికి మాత్రమే తమ పార్టీ నడవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. జనసేన ఆశయాలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై ఆయన కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం విశేషం. ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన ఈ వ్యాఖ్యలపై అధికార ఎన్డీయే కూటమి నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనసేన శ్రేణులు పవన్ కళ్యాణ్ నాయకత్వమే తమకు శిరోధార్యమని, ఆయనను సీఎం పీఠంపై చూడాలనేది కోట్ల మంది అభిమానులు, సైనికుల ఆకాంక్ష అని నానాజీ వ్యాఖ్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు మాత్రం కూటమి ధర్మాన్ని, సమన్వయాన్ని గుర్తుచేస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చింది కూటమి సమైక్యతకే తీర్పు అని, ఇరు పార్టీల మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు రావడానికి వీల్లేదని సూచిస్తున్నారు. ఈ పరిణామాలు ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత, ప్రాబల్యం గణనీయంగా పెరిగినప్పటికీ, భవిష్యత్తులో అధికార పంపకాలు, రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ క్రమంలో కూటమిలోని రెండు పార్టీల అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారనేది ప్రస్తుతం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# టీడీపీకి అండగా ఉన్నారనే బీసీలపై కక్ష

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



టీడీపీ హయాంలోనే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం జరిగిందని, బీసీలను చట్టసభలకు పంపిన ఘనత టీడీపీకే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించడంపై శాసనసభలో మంగళవారం నిర్వహించిన చర్చలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొల్లు రవీంద్రతో పాటు పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. బలహీనవర్గాలు ఎప్పుడూ టీడీపీకు వెన్నంటి ఉన్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. 1987లో దివంగత ఎన్టీఆర్ హయాంలో మొదటిసారిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1995లో చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని అచ్చెన్నాయుడు వివరించారు. 2020 వరకు ఈ రిజర్వేషన్లు ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలు కాగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సరైన చట్టసవరణలు చేయకుండా రిజర్వేషన్లు పెంచినట్లు నాటకమాడి, ఆ తర్వాత కోర్టు అడ్డంకులను సాకుగా చూపి 24 శాతానికే పరిమితం చేశారని విమర్శించారు. దీనివల్ల వేలాది మంది బీసీలు సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మేయర్ పదవులను కోల్పోయారని మండిపడ్డారు. నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు, రాబోయే అక్టోబర్‌లోపు నిర్వహించే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం చంద్రబాబు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు.

**వైసీపీ హయాంలో బీసీలు 16,800 పదవులను కోల్పోయారు: మంత్రి సవిత**

గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16,800 రాజకీయ పదవులను బీసీలు నష్టపోయారని మంత్రి సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల బడ్జెట్‌ను పెంచడంతో పాటు చేనేతలు, మత్స్యకారులు, వడ్డెరలు, నాయి బ్రాహ్మణులు, గీత కార్మికులకు పలు సంక్షేమ ప్రయోజనాలు కల్పించిందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నామని, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం సభలో తీర్మానం చేశామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించడం రాష్ట్రంలోని బీసీ వర్గాలందరికీ శుభవార్త అని మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీ నేతలను అణచివేయడమే కాకుండా, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్ వంటి వారిని దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తూ రక్షణగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

# డీఎస్సీపై చర్చకు సిద్ధమన్న మంత్రి పయ్యావుల

**అవసరమైతే సభను పొడిగించాలన్న బొత్స**

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ అంశంపై ప్రధాన ప్రతిపక్షం వైసీపీ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మధ్య తీవ్ర మాటల యుద్ధం సాగింది. సభ ప్రారంభమైన వెంటనే వైసీపీ ఎమ్మెల్సీ,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డీఎస్సీ వ్యవహారాన్ని లేవనెత్తారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని, అలాగే శాసనమండలితో పాటు శాసనసభలోనూ ప్రత్యేక చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. దీనిపై మండలి చైర్మన్ స్పందిస్తూ.. నియమావళి ప్రకారం ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని, దీనిపై మాట్లాడాలనుకుంటే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయించుకోవాలని సూచించారు. మండలి చైర్మన్ వ్యాఖ్యల తర్వాత మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ పై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే బీఏసీ సమావేశంలో కూడా స్పష్టం చేశామని తెలిపారు. అయితే మండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్సీల వద్ద ఎటువంటి సబ్జెక్టు లేదని, సభలో రచ్చ చేసి, అల్లరి సృష్టించి బయటకు వెళ్లడమే వారి ప్రధాన ఉద్దేశమని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చే ప్రజా ఉపయోగ అంశాలపై కాకుండా ప్రతిపక్షం సొంత రాజకీయ అజెండాతో కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,గోదావరి డెల్టా నీటి కేటాయింపులు, తాగునీటి సమస్యలు, ఉత్తరాంధ్ర ,రాయలసీమ ప్రాంతీయ సమస్యలపై ఒక్క వైసీపీ ఎమ్మెల్సీ కూడా మాట్లాడకపోవడం శోచనీయమని పయ్యావుల విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, వైసీపీ నేతలు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల అజెండానే కూటమి ప్రభుత్వ అజెండా అని, సభలో ఎల్‌నినో తీవ్రతపై చర్చ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ అంశంపై కూడా సమగ్ర చర్చ చేపడతామని స్పష్టం చేశారు. అయినప్పటికీ బొత్స సత్యనారాయణ తిరిగి డీఎస్సీపైనే పట్టుబట్టగా, ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత బీఏసీ సమావేశం నిర్వహిస్తామని, అక్కడ చర్చించుకోవచ్చని మండలి చైర్మన్ స్పష్టం చేశారు. డీఎస్సీతో పాటు ఇతర ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చ జరిగేందుకు అవసరమైతే శాసనమండలి సమావేశాల గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని బొత్స సత్యనారాయణ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బాధితులను క్షేమంగా తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన జాలర్లను సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు వేగవంతం చేసింది. ఈ నెల 3వ తేదీన వేటకు వెళ్లిన బోటు 15 రోజులు దాటినా తీరానికి తిరిగి రాకపోవడంతో, జాలర్లు గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. ఈ తీవ్ర ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు.బాధితులను క్షేమంగా తీసుకురావడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని చెప్పిన హోంమంత్రి, ఇండియన్ కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్, జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ గాలింపు చర్యలు ముమ్మరం చేశామని వెల్లడించారు. కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో నిరంతరం మాట్లాడుతూ రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జాలర్ల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని అధికారులను ఆదేశించారు.మరోవైపు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ కూడా ఈ ఘటనపై ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సముద్రంలో గాలింపు చర్యల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాలర్ల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించేందుకు కోస్ట్ గార్డ్ విమానాలు, నౌకల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్, ఆర్డీఓలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాలని సూచించారు.



# పోలీసులను ప్రజలు పట్టుకునే పరిస్థితి

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ తీవ్రంగా దిగజారిపోయిందని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసులే మద్యం తాగి ప్రమాదాలు చేసే పరిస్థితి దాపురించిందని, గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడినా ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించడం లేదని ఆరోపించారు. వంద రోజుల్లో గంజాయిని నిర్మూలిస్తామని చెప్పిన హోంమంత్రి మాటలు క్షేత్రస్థాయిలో నీటిమూటలయ్యాయని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి విచ్చలవిడిగా లభిస్తోందని ధ్వజమెత్తారు. గతంలో పోలీసులు దొంగలను పట్టుకుంటే, ఇప్పుడు అక్రమాలకు పాల్పడుతున్న పోలీసులను ప్రజలే పట్టుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గంజాయి దందా ఇంతగా ఊపందుకుంటున్నా, దానికి పోలీసులే కొమ్ముకాస్తున్నా హోంమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ పాలనలో అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపిన 'సెబ్' వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల రక్షణను గాలికి వదిలేసి, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మెడికో ప్రియాంక ఉదంతం, వినుకొండలో నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య వంటి ఘటనలు గంజాయి మత్తు, కూటమి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని, ఇవన్నీ కూడా ప్రభుత్వ హత్యలేనని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యారంగం నుంచి శాంతిభద్రతల వరకు అన్ని వ్యవస్థలను కూటమి నేతలు సర్వనాశనం చేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నేతలు ప్రజా సమస్యలను, ఆడబిడ్డల భద్రతను పక్కనబెట్టి సొంత లాభాలు, పదవుల పంపకాలపైనే శ్రద్ధ చూపుతున్నారని ఎద్దేవా చేశారు. డీఎస్సీ నిర్వహణలో అక్రమాలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పిందని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు చేసే అక్రమాలు, దౌర్జన్యాలకు పోలీసులు సెక్యూరిటీ గార్డులుగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి ప్రజావ్యతిరేక పాలనకు త్వరలోనే ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు.

# ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబం తనను తీవ్రంగా వేధిస్తోందంటూ ఆయన కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘంగా విచారణ చేపట్టిన ధర్మాసనం, రెండువర్గాల వాదనలను నమోదు చేసుకుంది. తర్వాత ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నెల 21న తుది తీర్పును వెలువరిస్తామని స్పష్టం చేయడంతో, న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌కు, తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లాకు చెందిన మేఘనకు సుమారు ఏడాది క్రితం వివాహం జరిగింది. అయితే పెళ్లయినప్పటి నుంచే అదనపు వరకట్నం కోసం, ఇతర కారణాలతో అత్తమామలు, భర్త తనను తీవ్రంగా వేధించడం ప్రారంభించారని మేఘన ఆరోపించారు. మధ్యలో ఇరువైపులా పెద్దలు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పెళ్లి సమయంలో నిజాలు దాచి తనను మోసం చేశారని, భర్త నపుంసకుడనే విషయం దాచారని, మతం మారాలని కూడా తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని ఆమె వాపోయారు. ఈ వేధింపులపై బాధితురాలు మేఘన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ దాఖలు చేయగా.. మాజీ మంత్రి జోగి రమేశ్‌తో పాటు మొత్తం 11 మందిపై పోలీసులు హత్యాయత్నం, వరకట్న వేధింపుల చట్టం కింద కేసులు నమోదు చేశారు. తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు కావడంతో, పోలీసుల అరెస్టు చర్యల నుంచి రక్షణ పొందడానికి జోగి రమేశ్ కుటుంబం విజయవాడ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసింది. విచారణ ముగియడంతో కోర్టు తీర్పు ఎలా ఉండబోతోందనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



# వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయండి

**కడప (ఏడీఎన్ఎన్) :**

కడప జిల్లాలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రైతులకు తక్షణమే మంజూరు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పడిన విద్యుత్ పరికరాల కొరత, కనెక్షన్ల జాప్యంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య తీవ్రతను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)కి ఎంపీ మంగళవారం లేఖ రాశారు. తర్వాత వారితో ఫోన్‌లో మాట్లాడి జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. గత రెండేళ్లుగా జిల్లాలో రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో వారు సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు నిత్యం అల్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోయాయని, దీనివల్ల రైతాంగం తీవ్ర నష్టపోతోందని ఆయన వెల్లడించారు. కనెక్షన్ల మంజూరుకు ప్రధాన అవరోధంగా మారిన విద్యుత్ పరికరాల తీవ్ర కొరతను తక్షణమే అధిగమించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లను క్లియర్ చేయడానికి అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్లను వెంటనే జిల్లాకు విడుదల చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ యాజమాన్యానికి వైఎస్ అవినాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్య పరిష్కారంతోనే రైతులకు ఊరట లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# స్లీపర్ బస్సు ప్రమాదాలపై కోటంరెడ్డి ఆందోళన

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో ప్రైవేట్ స్లీపర్ బస్సుల వల్ల జరుగుతున్న వరుస ప్రమాదాలు, ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల తీవ్ర నిర్లక్ష్యంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఏపీ శాసనసభ సమావేశాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆపరేటర్ల బాధ్యతారాహిత్యం వల్ల నిత్యం అమాయక ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేట్ బస్సుల్లో సేఫ్టీ మెజర్స్ ను పూర్తిగా విస్మరిస్తున్నారని, మార్గమధ్యంలో జరిగే ప్రతి 10 ప్రమాదాలలో 8 ప్రమాదాలు కేవలం వారి నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం దూరప్రాంతాలకు వెళ్లే ప్రతి స్లీపర్ బస్సులోనూ ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ, లాభాల కోసం ఒక్క డ్రైవర్‌తోనే సుదీర్ఘ ప్రయాణాలు నడుపుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా, డ్రైవర్లకు కనీసం 'డ్రంక్ అండ్ డ్రైవ్' టెస్టులు కూడా నిర్వహించడం లేదని ఆరోపించారు. అదనపు సంపాదన,సీట్ల పెంపు కోసం ప్రమాద సమయాల్లో ప్రయాణికులు బయటపడే అత్యవసర ద్వారాలను కూడా మూసివేసి, అక్కడ స్లీపర్ బెర్త్ లను ఏర్పాటు చేస్తుండటం దారుణమని కోటంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రమాదాలకు కారణమయ్యే నిర్లక్ష్య ఆపరేటర్లు, బాధ్యులపై కేవలం సాధారణ యాక్సిడెంట్ కేసులు కాకుండా, హత్య కేసులు నమోదు చేయాలని, పీడీ యాక్ట్ ప్రయోగించాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. అభి బస్, రెడ్ బస్, మాయా బస్ వంటి ఆన్‌లైన్ టికెటింగ్ సంస్థలు బుకింగ్స్ ద్వారా వందల కోట్ల రూపాయల రాబడి పొందుతున్నప్పటికీ, ప్రభుత్వ ఖజానాకు మాత్రం ప్రయోజనం ఉండటం లేదని పేర్కొన్నారు. ఈ సమస్య నివారణకు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఎమ్మెల్యే కోటంరెడ్డి ఒక కీలకమైన సూచన చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల రవాణా మంత్రులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, అన్ని ప్రైవేట్ బస్సు టికెట్ల బుకింగ్‌లను ఆర్టీసీ యాప్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ప్రైవేట్ బస్సులన్నీ ఆర్టీసీ యాప్ నియంత్రణలో ఉంటేనే, పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించే వాహనాలకే అనుమతులు ఇవ్వడం సాధ్యమవుతుందని ఆయన సభలో స్పష్టం చేశారు.



# అమరావతి అసురులు సంచరించే పాపపు భూమి

**గుంటూరు (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి సంచలన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నాడు అమరావతి అమరులు సంచరించిన పుణ్యభూమి అని, నేడు అసురులు సంచరిస్తున్న పాపపు భూమి," అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన ఒక పోస్ట్ తీవ్ర దుమారం రేపుతోంది. రాజధాని ప్రాంతంపై మొదటి నుంచీ విభిన్న వైఖరి వ్యక్తం చేస్తున్న అంబటి, తాజాగా మరోసారి అంతటి తీవ్రమైన పదజాలంతో కామెంట్స్ చేయడం రాజకీయ వర్గాల్లో వేడి పుట్టించింది. అంబటి రాంబాబు వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలోనే నివాసముంటూ రాజధాని అమరావతిపై ఈ విధంగా విషం చిమ్మడం ఏమాత్రం తగదని పలువురు హితవు పలికారు. రాజకీయ విమర్శల వరకు ఓకే గానీ, ఒక ప్రాంతాన్ని, అక్కడి ప్రజల భావోద్వేగాలను హేళన చేసేలా వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికైనా ఆయన తన వైఖరిని మార్చుకోవాలని నెటిజన్లతో పాటు పలు రాజధాని ప్రాంత నెటిజన్లు సూచిస్తున్నారు.



## రాష్ట్రానికే రోల్ మోడల్‌గా మణుగూరు ఐటీఐ-ఏటీసీ

**మణుగూరు (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు మణుగూరు ప్రభుత్వ ఐటీఐ-అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రశంసించారు. మణుగూరు ఏటీసీలో మంగళవారం జరిగిన విద్యార్థుల నూతన ఆవిష్కరణల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి సొంతంగా రూపొందించిన నూతన ఎలక్ట్రిక్ వాహనాలను మంత్రి పరిశీలించి, లాంఛనంగా ప్రారంభించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు తమ సృజనాత్మకతతో ఇలాంటి ఆవిష్కరణలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు రూపొందించిన ఈ ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసి, కమర్షియల్ వెహికల్స్‌గా మార్కెట్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆవిష్కరణలు కేవలం ప్రాజెక్టులకే పరిమితం కాకుండా, పరిశ్రమల సహకారంతో ఉత్పత్తులుగా మారాలన్నారు. రాష్ట్రంలోని 119 ఏటీసీల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించి, అత్యుత్తమ ఆవిష్కరణలు చేసేవారికి అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు.తెలంగాణలో సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను 'టాటా' సంస్థ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సంప్రదాయ కోర్సులతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఆధునిక కోర్సులను ఇందులో ప్రవేశపెడుతున్నామన్నారు. మణుగూరు ఏటీసీలో శిక్షణ పొందుతున్న వారిలో సుమారు 100 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు టాటా సంస్థ ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. త్వరలో గిరిజన ప్రాంతాల్లో యువ రైతుల కోసం వ్యవసాయ రంగానికి సంబంధించిన ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశపెడతామని వెల్లడించారు.

## భూ మాఫియాకు కొమ్ముకాస్తే చూస్తూ ఊరుకోం



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరికి ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా '22ఏ' (22A) నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూ మాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ధరణి పోర్టల్ రద్దు చేసినా, భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. "గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను 'సెటిల్ మెంట్' చేసుకుంటోంది" అని ఈటల విమర్శించారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేస్తే ఊరుకోం



**మహబూబ్‌నగర్ (ఏడీఎన్ఎన్) :**

పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను ఏమాత్రం కుదించకుండా యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ పథకాలను రద్దు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పేదలపై ఎలాంటి భారం పడకుండా కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం కోర్టు కేసులను ఒక సాకుగా చూపుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. న్యాయపరంగా ముందుకు వెళ్లి సమస్యను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, బాలికల విద్య కోసం పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.ఇంట్లో ఉన్న అందరికీ పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భూ బదలాయింపులపై సీబీఐ విచారణ జరపాలి



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రజల ఆస్తిని కాపాడాల్సిన ప్రభుత్వమే బ్రోకరిజం చేస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రాబరీ మినిస్టర్‌గా మారారని ఆరోపించిన ఆయన.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంత్రి కాకముందు, ఆ తర్వాత ఆయన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీనిక్స్ కంపెనీ నుంచి రూ.15 వేల కోట్ల విలువైన భూమి పొంగులేటి కంపెనీకి బదలాయింపు జరిగిందని, హైటెక్ సిటీలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కు ఫీనిక్స్ కంపెనీ భూమి బదిలీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటిపై పూర్తి ఆధారాలతో తాను వస్తానని, తనతో బహిరంగ చర్చకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిద్ధమా అని ఏలేటి సవాల్ విసిరారు.నిషేధిత భూముల వ్యవహారంపై లోకాయుక్తా, గవర్నర్‌తో పాటు ఈడీ, సీబీఐలకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఏలేటి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దోచుకున్న సొమ్మును దాచుకోవడానికే విదేశీ యాత్రకు వెళుతున్నారా అని అనుమానం వ్యక్తం చేసిన ఆయన.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. 22(a) నిషేధిత జాబితాలో భూములను చేర్చి, ఆ తర్వాత క్షమాపణ చెబితే సరిపోదని, పొంగులేటి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## 22ఏ ఆస్తుల బాధితులకు మంత్రి భరోసా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



22ఏ జాబితాతో ప్రైవేట్ ఆస్తుల యజమానులకు ఇబ్బంది కలిగిన మాట వాస్తవమేనని, అయితే ఈ వివాదాన్ని దాచిపెట్టాలనో, ప్రజలను మభ్యపెట్టాలనో తమ ప్రభుత్వం అనుకోవడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జరిగిన వాస్తవాన్ని ప్రజలకు వివరించామని, ఈ వివాదంలో జరిగిన పొరపాటును భేషరతుగా అంగీకరించి ఇప్పటికే దానిని సరిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టామని ఆయన తెలిపారు.ప్రజల ఆస్తులను ఉద్దేశపూర్వకంగానే 22ఏలో పెట్టి, వాటిని రిలీజ్ చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. హరీశ్ రావు ఇప్పుడు 'అబద్ధాల రావు'గా మారారని ఆయన ఎద్దేవా చేశారు. పొరపాటు జరిగిందని తాను స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పినా, 22ఏ విషయంలో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు హరీశ్ రావు తీరు ఉందని విమర్శించారు.తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ, నిబద్ధత ఉన్నాయని, అందుకే అధికారుల పక్షాన తప్పు జరిగితే అంగీకరించి క్షమాపణలు కూడా చెప్పామని పొంగులేటి గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ధరణి మూలంగా ఎంతో మంది సామాన్య ప్రజలు ఆత్మహత్యలు చేసుకున్నా ఏనాడైనా స్పందించారా, క్షమాపణలు కోరారా అని ప్రశ్నించారు. తప్పు జరిగినా బుకాయించే రకం తమది కాదని, హరీశ్ రావు గుండెల మీద చెయ్యి వేసుకుని ధరణిలో ఆడిన ఆటలు, చెప్పిన అబద్ధాలు గుర్తుచేసుకోవాలని మండిపడ్డారు.ఈ 22ఏ సమస్య ఎందుకు తలెత్తిందో మంత్రి వివరించారు. 1998 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వ జీవోలు, మెమోలతో హక్కులు లభించిన భూములకు సంబంధించిన కాపీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాలేదన్నారు. ఆ విషయం గ్రహించకుండా హైకోర్టు ఆదేశాలతో 22ఏ జాబితాను జిల్లాల కలెక్టర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వల్లే ఈ నిషేధిత భూముల సమస్య వచ్చిందని, దీన్ని గ్రహించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ కోర్ ఏరియాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయబద్ధమైన 22ఏ బాధితుల ఆస్తులకు తమ ప్రభుత్వమే పూర్తి భద్రత కల్పిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సమస్యను నెలాఖరులోపు పరిష్కరించాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశామన్నారు. దీనికోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ లోకేశ్, రాజీవ్ గాంధీలతో పాటు మరో ముగ్గురితో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే 15 రోజుల పాటు వీరు ప్రతిరోజూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని వెల్లడించారు. ఎక్కడైనా రిజిస్ట్రేషన్ స్లాట్స్ షార్ట్ ఫాల్ ఉంటే వాటిని కూడా పొడిగించాలని అధికారులను ఆదేశించినట్లు పొంగులేటి తెలిపారు.

## ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే '22ఏ' కుట్ర

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత భూముల జాబితా వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో.. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 22ఏ జాబితా వ్యవహారం వెనుక ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలనను అందిస్తున్న తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే కొందరు కావాలని ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చారని మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన మండిపడ్డారు. ఈ 22ఏ జాబితా అంశంపై ప్రభుత్వం త్వరలోనే సమగ్ర విచారణ జరిపిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కుట్ర వెనుక ఎవరు ఉన్నా, ఎంతటి వారైనా సరే వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా, గత ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతల్లో పనిచేసిన కొందరు అధికారుల పాత్ర దీని వెనుక ఉండి ఉండవచ్చని తాను బలంగా అనుమానిస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములను రాత్రికి రాత్రే ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా 22ఏ (నిషేధిత భూములు) జాబితాలో చేర్చడంపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి భూ యజమానులు, ప్లాట్ల ఓనర్లు, సామాన్య ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## పేదల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




పేదల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోమని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కార్యాలయంలో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆమె.. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వస్తే పేదల కోసం 'భూలక్ష్మి' అనే సరికొత్త పథకాన్ని తీసుకువస్తామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుపేదలకు భూ పంపిణీ చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెబుతున్న సామాజిక న్యాయం ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదని కవిత మండిపడ్డారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఉద్యమకారిణి విజయశాంతి లాంటి వారిని పక్కనపెట్టి కేవలం ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టి అవమానించిందని విమర్శించారు. ప్రభుత్వం నియమించిన సలహాదారుల (అడ్వైజర్ల) జీతాల విషయంలోనూ తీవ్ర వివక్ష కనిపిస్తోందని, అప్పర్ క్లాస్ వారు మాట్లాడితే ఒక రకమైన చర్యలు, లో క్లాస్ వారు మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటూ రేవంత్ సర్కార్ 'ఆటవిక న్యాయాన్ని' అమలు చేస్తోందని ఆమె ధ్వజమెత్తారు.సీఎం రేవంత్‌రెడ్డికి భూమి అంటే కేవలం ఒక కమర్షియల్ ట్రాన్సాక్షన్ (వ్యాపార లావాదేవీ)గా మారిపోయిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, అన్యాక్రాంతమైన భూములను వెంటనే సేకరించి.. పేద కుటుంబానికి ఎకరం చొప్పున పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పంపిణీ చేశారని ఆమె గుర్తుచేశారు. సీఎం రేవంత్ పదేపదే గతం గురించే మాట్లాడటం మాని, ప్రస్తుతం ప్రజలకు చేయాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆమె హితవు పలికారు.

## పాడైపోయిన క్రీమ్‌తో కల్తీ నెయ్యి తయారీ

### 36 టన్నుల నకిలీ సామగ్రి సీజ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హైదరాబాద్ నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ నెయ్యి మాఫియాపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ విభాగమైన హెచ్‌ఫాస్ట్ అధికారులు రహస్యంగా దాడులు నిర్వహించి కల్తీ నెయ్యి తయారీ, విక్రయ యూనిట్లను రట్టు చేశారు. ఈ దాడులకు సంబంధించిన వివరాలను నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ అధికారికంగా వెల్లడించారు. కల్తీ ఆహారం నుంచి తెలంగాణను విముక్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల ప్రాణాలతో ఆడుకునే వారిపై కఠినమైన 'పీడీ యాక్ట్' నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.హెచ్‌ఫాస్ట్ నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో దాదాపు 36 టన్నుల కల్తీ సామాగ్రిని అధికారులు సీజ్ చేశారు. ఇందులో 25.5 టన్నుల కల్తీ నెయ్యితో పాటు, దాని తయారీకి వినియోగిస్తున్న 10.5 టన్నుల ముడి పదార్థాలు ఉన్నాయి. 8.7 టన్నుల పాడైపోయిన క్రీమ్, 1,200 లీటర్ల పామాయిల్, 600 లీటర్ల వనస్పతి, 30 కిలోల గంజి పొడితో పాటు.. అసలు ఆహారంలో వాడకూడని 3 రకాల కెమికల్ ఫ్లేవర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠా నెయ్యి తయారీ విధానం అధికారులనే విస్తుపోయేలా చేసింది. ఇతర రాష్ట్రాలైన హర్యానా, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుల నుంచి పాడైపోయిన క్రీమ్‌ను తక్కువ ధరకు తీసుకొచ్చి, దానికి పాల పౌడర్, పామాయిల్, వనస్పతి, గంజి పొడి కలుపుతున్నారు. నెయ్యి పూస పూసగా కనిపించేందుకు 'బొంబాయి రవ్వ'ను, అసలైన నెయ్యి వాసన రావడం కోసం ప్రమాదకరమైన రసాయన ఫ్లేవర్లను వాడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.ఈ కల్తీ నెయ్యిని ఎలాంటి లేబుల్స్, తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకుండా ఆవు నెయ్యి, దేశీ నెయ్యి పేరుతో మార్కెట్లోకి వదులుతున్నారు. ప్రధానంగా హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రముఖ స్వీట్ షాపులతో పాటు ఆయుర్వేద మందుల తయారీలోనూ దీన్నే వాడుతున్నట్లు గుర్తించారు. ఈ నమూనాలను ల్యాబ్‌కు పంపగా.. నెయ్యి స్వచ్ఛతను తెలిపే ఆర్.ఎమ్ (RM) వాల్యూలో తీవ్ర వ్యత్యాసాలు రావడంతో పాటు, సున్నా ఉండాల్సిన విషపూరిత పారామీటర్లు ఏకంగా 20,000 వరకు నమోదైనట్లు సీపీ దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడించారు. ఇలాంటి విషపూరితమైన కల్తీ నెయ్యిని వాడటం వల్ల గుండె, కాలేయ సంబంధిత వ్యాధులతో పాటు తీవ్రమైన చర్మ సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ వ్యాపారులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో 'టిజి సేఫ్' (TG SAFE) విభాగంతో సమన్వయం చేసుకుంటూ నగరవ్యాప్తంగా దాడులు మరింత తీవ్రతరం చేస్తామని పోలీసులు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని, ఏజెన్సీ ప్రాంతాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళా సర్పంచులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పీసా చట్టంపై సర్పంచులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, ఆ చట్టం ఇచ్చిన అధికారాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. గ్రామసభలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా, సామాజిక మార్పునకు వేదికలుగా మార్చుకోవాలన్నారు. కేవలం రోడ్లు, భవనాలు నిర్మించడమే అభివృద్ధి కాదని.. ప్రజల ఆదాయం పెరగడం, ఉపాధి, మెరుగైన విద్య, వైద్యం అందడం కూడా అభివృద్ధిలో భాగమేనని మంత్రి స్పష్టం చేశారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, పోషకాహారం వంటి అంశాలపై గ్రామసభల్లో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అలాగే, ఇప్పపువ్వు లడ్డూ, మిల్లెట్స్ బిస్కెట్ల వంటి స్థానిక, సంప్రదాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా గిరిజనుల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సర్పంచులు తమ ఐదేళ్ల పదవీ కాలంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తూ, పారదర్శక పాలనతో జాతీయ స్థాయిలో పురస్కారాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీజీ శాంతికుమారి, కమిషనర్ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**కరీంనగర్ (ఏడీఎన్ఎన్) :**

వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా కరీంనగర్ నగర కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. దీనికి సంబంధించి అయ్యే విద్యుత్ ఖర్చు మొత్తాన్ని కరీంనగర్ నగర కార్పొరేషనే స్వయంగా భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.నగరంలోని విద్యానగర్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో గణేశ్ మండపాల నిర్వాహకులు సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.





## రాజ్యాంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**


రాజ్యాంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన.. భారత ఎన్నికల సంఘం (ఈసీ) కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని చూస్తుంటే, ఎన్నికల సంఘం నిబంధనల వల్ల రాష్ట్రంలో చాలా నష్టం జరుగుతోందని, ఈ వ్యవహారంపై ఈసీ ఉదాసీనంగా వ్యవహరించడం ఏమాత్రం సరికాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల ఓట్లు ఉంటే, అందులో ఏఎస్‌బీడీల పేరుతో ఏకంగా 22 శాతం ఓట్లను తొలగించారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేద ప్రజల ఓట్లు గల్లంతవుతున్నాయని, ఈ అక్రమ ఓట్ల తొలగింపునకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 2002లో ఓటు వేసి ఉండాలన్న నిబంధనతో చాలా మంది ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేకపోయారని, దీన్ని సాకుగా చూపి వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తూ సామాన్యుడి ఓటును గల్లంతు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఈసీ తీరుపై నిప్పులు చెరిగారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మంది బీఎల్ఏలను (BLA) నియమిస్తే, ఈసీ రికార్డుల్లో మాత్రం కేవలం 13,100 మందిని మాత్రమే చూపిస్తోందని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో 32,37,000 అన్‌మ్యాప్డ్ ఓట్లు, 60,50,000 ఓట్లు సందేహాస్పదంగా ఉన్నాయని చెబుతూ.. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు కోటీ 60 లక్షల ఓట్లపై ఎందుకు క్వశ్చన్ మార్క్ పెట్టారో ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని, దేశంలో పౌరుల ఓటు హక్కును తొలగించే అధికారం ఈసీకి ఎవరు ఇచ్చారని ఆయన సూటిగా ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, తెలంగాణలో ఎస్ఐఆర్‌కు మరింత గడువు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.



## రూ.230కే సిమెంట్ బస్తా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. మంత్రి విజ్ఞప్తి మేరకు ఒక్కో సిమెంట్ బస్తాను రూ. 230లకే అందించడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితాన్ని, సామాజిక భద్రతను, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, వీటిలో ఇప్పటికే 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సిమెంట్ ధరలను తగ్గించడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల యాజమాన్యాలకు మంత్రి పొంగులేటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## 22ఏ జాబితా పేరుతో కమీషన్ల దందా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైవేల మీద వాహనాలకు టోల్ ఫీజు వసూలు చేసినట్లుగానే.. కాంగ్రెస్ ప్రభుత్వం 1800 5-99 4788 నెంబర్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి కమీషన్లు దండుకుంటోందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. 22ఏ నిషేధిత జాబితాలో పెట్టిన ఆస్తుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వ్యవస్థ.. టోల్ ఫ్రీ నెంబర్ కాదని, అది పక్కాగా 'టోల్ ఫీ' నెంబర్ అని ఆయన ఎద్దేవా చేశారు.ప్రజల కష్టార్జితమైన ఆస్తులు పొరపాటున 22ఏ బ్లాక్ లిస్టులోకి వెళ్లాయని, టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే వాటిని తొలగిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడాన్ని ప్రవీణ్ కుమార్ తప్పుబట్టారు. ఆ నెంబర్‌కు బాధితులు కాల్ చేయగానే.. తమకు 30 శాతం కమీషన్ ఇస్తేనే జాబితా నుంచి పేర్లు తొలగిస్తామని డీల్ మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. మంత్రి పొంగులేటితో పాటు కాంగ్రెస్ నాయకులు నేరుగా అక్రమంగా డబ్బులు సంపాదించుకోవడానికే ఈ దందాను నడుపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో పేదల ఇందిరమ్మ ఇళ్లను సైతం 22ఏ పరిధిలోకి తెచ్చారని, మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకే కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారని ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. గతంలో కలెక్టర్లు, ఎమ్మార్వోలకే తెలియకుండా భూభారతి ద్వారా 22 వేల ట్రాన్సాక్షన్లు జరిగాయని, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఈ 22ఏ నిషేధిత ఆస్తుల తతంగాన్ని ఆపి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై భగ్గుమన్న బీఆర్ఎస్

**ఖమ్మం / కామారెడ్డి జిల్లా (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 'కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 'తులం బంగారం' హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. ఇందులో భాగంగా మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, కామారెడ్డి జిల్లా మద్నూర్‌లలో గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచే ఈ పథకాలకు వెంటనే నిధులు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




**సత్తుపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నిరసనలో పెనుబల్లి, వేంసూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నిరసన కార్యక్రమంలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు వాటిని పూర్తిగా అటకెక్కించిందని ఆయన మండిపడ్డారు. గత 30 నెలలుగా లబ్ధిదారులకు ఇవ్వాల్సిన చెక్కులతో పాటు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్లే ఈ పథకాలకు స్టే వచ్చిందని, ఆ నెపాన్ని రేవంత్ సర్కార్ తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు కాలువలు దెబ్బతినడంపై ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**మద్నూర్‌లో పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వచ్చేందుకు తులం బంగారం ఇస్తామని ఆశ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు మాట తప్పడం సరికాదని అక్కడి నాయకులు డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉండే ఈ పథకాలను కొనసాగించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు బన్సీ పటేల్, కృష్ణ పటేల్, సచిన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది విగ్రహం కూల్చివేత... నర్సంపేటలో హైటెన్షన్

**వరంగల్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి . నర్సంపేట మెడికల్ కాలేజీ ఎదురుగా ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని సుమారు 1,500 మంది పోలీసుల భారీ బందోబస్తు మధ్య కూల్చివేసి, ఆ ప్రాంతాన్ని చదును చేశారని ,కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి.



**కన్నీరుమున్నీరైన పెద్ది సతీమణి స్వప్న**

విగ్రహాన్ని కూల్చివేసిన విషయం తెలుసుకున్న పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నల్లబెల్లిలోని ఆమె ఇంటి చుట్టూ సుమారు 400 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. ఈ క్రమంలో ఆమె తన భర్త విగ్రహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. "నువ్వు లేని రోజు చూడు.. ఈ ఊళ్లో ఎంత అరాచకం జరుగుతోందో" అంటూ ఆమె రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. "మేము ఎక్కడో బయట చౌరస్తాలో విగ్రహం పెట్టలేదు.. అభిమానంతో ఒక వ్యక్తి తన సొంత ప్రైవేట్ స్థలంలో చిన్న విగ్రహం ఏర్పాటు చేశాడు. ఈరోజు దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆ విగ్రహాన్ని కూల్చివేయడం అత్యంత బాధాకరం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం , ఎమ్మెల్యే దొంతి పై విమర్శలు**

పెద్ది సుదర్శన్ రెడ్డి ఎదుగుదలను సహించలేకే సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్షగట్టి ఈ పనికి పూనుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు నాడే, ఆయనకు గిఫ్ట్ గా పెద్ది విగ్రహాన్ని కూల్చేశారని మండిపడుతున్నారు.

**ఉద్యమకారుడిని అవమానిస్తారా?: పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

ప్రజా నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నర్సంపేట ప్రజల గుండెల్లో పెద్దికి స్థానం ఉందని, అధికార బలంతో ఒక్క విగ్రహాన్ని తొలగిస్తే.. రాబోయే రోజుల్లో గ్రామగ్రామాన ఆయన విగ్రహాలు నిలబెడతామని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ గృహ నిర్బంధం**

విగ్రహ కూల్చివేతను నిరసిస్తూ చలో నర్సంపేట కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్‌లతో సహా పలువురు నాయకులను అరెస్టు చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రైవేట్ స్థలంలో తమ నాయకుడి విగ్రహాన్ని పెట్టుకునే హక్కు కూడా లేదా అని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు.

**ఎమ్మెల్యే దొంతి దిష్టిబొమ్మ దహనం**

విగ్రహం తొలగింపును నిరసిస్తూ దుగ్గొండి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యలు వదిలేసి ఇలా కక్షసాధింపులకు పాల్పడితే ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరుగుతుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేర్గు రాంబాబు, పొన్నం మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# 'హెరిటేజ్' వేడుకలకు సిద్ధమైన రాజంపేట రైల్వేస్టేషన్

- బ్రిటీషు కాలం నాటి రవాణా మార్గం.. మారుతూ వచ్చిన జోన్లు
- 1999లో నక్సల్స్ పేల్చివేత.. రూ.3 కోట్ల నష్టం
- అమృత్ భారత్'తో కార్పొరేట్ లుక్
- మిరుమిట్లు గొలిపేలా శతాబ్దిన్నర ఉత్సవాలు:

**రాజంపేట (ఏడీఎన్ఎన్) :**

రాయలసీమ ప్రాంత వాణిజ్య ప్రగతికి, దక్షిణ భారతదేశ రైల్వే చరిత్రకు కీలక మైలురాయిగా నిలిచిన చారిత్రాత్మక రాజంపేట రైల్వేస్టేషన్ శతాబ్దాల ఘనమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కేంద్ర రైల్వేబోర్డు నిర్వహించ తలపెట్టిన 'హెరిటేజ్ స్టేషన్ మాసోత్సవం' వేడుకలకు రేణిగుంట, వాల్తేరులతో పాటు రాజంపేట ఎంపిక కావడం విశేషం. భారతీయ రైల్వేలోని మొత్తం 103 వారసత్వ (హెరిటేజ్) స్టేషన్లలో రాజంపేటకు స్థానం దక్కింది. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని రైల్వేబోర్డు, హెరిటేజ్ కమిటీలు రాబోయే 4 నెలల కాలానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి. బ్రిటీషు పాలకులు 1866 నవంబర్ 15న మద్రాస్ రైల్వే బ్రాడ్‌గేజ్ మార్గంగా రాజంపేట స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి ముంబై నగరాన్ని కలిపే ప్రతిష్ఠాత్మక 'నార్త్ వెస్ట్ లైను' కింద ఇది ప్రారంభమైంది. నాటి నుంచి ఈ స్టేషన్ పలు జోన్ల పరిధిలోకి మారుతూ వచ్చింది. 1908లో ఎంఎస్ఎం రైల్వేగా, 1956లో సదరన్ రైల్వే (గుంతకల్ డివిజన్)గా, 1977లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి మారింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సొంత రైల్వే జోన్ అయిన దక్షిణ తీర రైల్వే (విశాఖపట్నం) పరిధిలో ఈ స్టేషన్ నడుస్తోంది. రాజంపేట రైల్వే స్టేషన్ సుదీర్ఘ చరిత్రలో ఒక భయానక ఘటన కూడా చోటుచేసుకుంది. 1999 డిసెంబరు 12న పీపుల్స్ వార్ గ్రూప్‌కు చెందిన నక్సలైట్లు రాజంపేట రైల్వేస్టేషన్‌ను బాంబులతో పేల్చివేశారు. ఈ ఘోర దాడిలో పాత స్టేషన్ భవనం పూర్తిగా ధ్వంసం కాగా, అప్పట్లోనే రైల్వే శాఖకు రూ.3 కోట్ల మేర భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఆ తర్వాత దక్షిణ మధ్య రైల్వే ఈ స్థానంలో ఆధునిక కొత్త భవనాలను నిర్మించింది. ఈ చారిత్రక స్టేషన్‌ను ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి తన కృషి ద్వారా 'అమృత్ భారత్' పథకం కింద చేర్పించి, రూ.28.51 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో ప్రయాణికులను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి వసతులతో స్టేషన్‌కు సరికొత్త కార్పొరేట్ లుక్ వచ్చింది. ఢిల్లీ వెళ్లే రైలు హాల్టింగ్‌తో పాటు పలు ప్రధాన రైళ్ల నిలుపుదలను ఆయన సాకారం చేశారు. అలాగే పాదచారుల కోసం సబ్‌వే నిర్మాణం కొరకు గత బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించేలా ఎంపీ చొరవ తీసుకున్నారు. రాబోయే వేడుకలలో రైల్వేబోర్డు ఆదేశాల మేరకు రాజంపేట స్టేషన్‌లో జెండా మార్చ్, 160 ఏళ్ల చారిత్రక ప్రస్థానాన్ని తెలిపే ఫొటోల ప్రదర్శన, హీలియం బెలూన్లు ఎగరవేయడం, 'విరాసిత్' స్మారక పత్రిక ఆవిష్కరణ నిర్వహించనున్నారు. వీటితో పాటు రాత్రి వేళల్లో లేజర్ షోలు, ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో కళ్లు మిరుమిట్లు గొలిపే ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా స్థానిక విశిష్ట వ్యక్తులతో పాటు ఉత్తమ సేవలుందించిన రైల్వే ఉద్యోగులను అవార్డులతో సత్కరించనున్నారు.




# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బాంబు బెదిరింపు కలకలం

**అప్రమత్తమైన భద్రతా దళాలు!**

**హైదరాబాద్: (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం లో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. శంషాబాద్ నుంచి భోగాపురం వెళ్లాల్సిన ఒక ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎయిర్‌పోర్టు అధికారులకు ఈమెయిల్ రావడం తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.బాంబు బెదిరింపు సమాచారంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానంతో పాటు, ఎయిర్‌పోర్టు ప్రాంగణమంతా డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్ తో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.మరోవైపు, ఈ బాంబు బెదిరింపు మెయిల్ వ్యవహారంపై నిఘా వర్గాలు, పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? ఐపీ అడ్రస్ ఏంటి? దీని వెనుక ఎవరున్నారు? ఇది ఆకతాయిల పనేనా లేక మరేదైనా కుట్ర ఉందా? అనే కోణాల్లో సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో ఆరా తీస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, ఎయిర్‌పోర్టు అధికారులు పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.




# ఉద్యోగులకు 29 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

**గుంటూరు (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) ఆధ్వర్యంలో 12వ పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి) తో పాటు ఉద్యోగుల పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి, ఈ వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా చాంద్ బాషా డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిలో ఉద్యోగులకు 29 శాతం ఫిట్‌మెంట్ కల్పించాలని, దానిని 2023 జులై 1 నుంచి వర్తింపజేయాలని కోరారు. ఏరియర్స్ మొత్తాన్ని 2026 జులై 31 వరకు జిపిఎఫ్ ఖాతాల్లో జమ చేసి, ఆగస్టు 1 నుంచి జీతాలతో కలిపి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎస్ విధానంపై ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే రాబోయే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు రిజిస్టర్ అయిన అన్ని ఉద్యోగ సంఘాలను ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వం త్వరగా స్పందించి ఉద్యోగులకు సానుకూల నిర్ణయాలు ప్రకటించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు రెహమాన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి రాజు, నగర శాఖ కార్యదర్శి శంకర్, సహాయ అధ్యక్షులు అబ్దుల్లా, అన్వర్ బాషా తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.





## రాశి ఫలాలు

**19-08-2026 బుధవారం**

**మేషం:**
ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. అనవసర ఖర్చులు తగ్గించండి. సహోద్యోగులతో ప్రశాంతంగా మాట్లాడితే పాత సమస్యలు పరిష్కారమవుతాయి. కొత్త పరిచయాలు లాభిస్తాయి.

**వృషభం:**
పాత బకాయిలు, పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి. ఆర్థిక నిర్ణయాల్లో ఓపిక అవసరం. స్థిరమైన పనితీరు, క్రమశిక్షణతో అధికారుల ప్రశంసలు పొందుతారు

**మిథునం:**
పని వేగం పెరుగుతుంది. కొత్త అవకాశాలు, పరిచయాలు ఏర్పడతాయి. మీ ఆలోచనలను ధైర్యంగా చెప్పండి. తొందరపాటు కొనుగోళ్లు, ఆర్థిక నిర్ణయాలకు దూరంగా ఉండండి.

**కర్కాటకం:**
డబ్బు ప్రణాళికలో స్పష్టత వస్తుంది. కుటుంబ ఆర్థిక విషయాలను జాగ్రత్తగా నిర్వహించండి. కార్యాలయంలో తెలివైన నిర్ణయాలతో మంచి గుర్తింపు పొందే అవకాశం ఉంది.

**సింహం:**
సూర్య ప్రభావంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పనిలో గుర్తింపు లభిస్తుంది. అయితే కేతు ప్రభావంతో పెద్ద నిర్ణయాల్లో తొందరపడకండి. ఖర్చులను నియంత్రించండి..

**కన్య:**
ఆర్థిక విషయాల్లో జాగ్రత్త అవసరం. ప్రతి ఖర్చును పరిశీలించండి. పనిలో తప్పులను సరిదిద్దుతూ ముందుకు సాగండి. మీ సూక్ష్మ పరిశీలనా శక్తి మంచి ఫలితాలు ఇస్తుంది.

**తుల:**
ఖర్చు, పొదుపు మధ్య సమతుల్యత పాటించండి. సమావేశాలు, టీమ్ వర్క్‌లో మీ మాటతీరు ఉపయోగపడుతుంది. భాగస్వాములతో మర్యాదగా మాట్లాడి పరిష్కారాలు సాధించండి.

**వృశ్చికం:**
ఆర్థిక ప్రణాళికలను గోప్యంగా ఉంచడం మంచిది. పాత అప్పులు, ఖర్చులను సమీక్షించండి. పెండింగ్ పనులు పూర్తి చేస్తే భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది ఏర్పడుతుంది.

**ధనస్సు:**
కొత్త పరిచయాలు ఆర్థిక అవకాశాలను తెస్తాయి. ఏ ఆఫర్ అయినా పూర్తిగా పరిశీలించండి. టీమ్ వర్క్, సమావేశాలు మరియు నెట్‌వర్కింగ్ ద్వారా కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటాయి

**మకరం:**
పొదుపులు, బాధ్యతలు, దీర్ఘకాలిక లక్ష్యాలను సమీక్షించండి. కెరీర్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయండి. మీ క్రమశిక్షణను సీనియర్లు గుర్తించే అవకాశం ఉంది.

**కుంభం:**
ఆర్థిక నిర్ణయాల్లో అప్రమత్తంగా ఉండండి. కొత్త ఆలోచనలకు సరైన ప్రణాళిక అవసరం. భాగస్వాములతో కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. తొందరపాటు నిర్ణయాలు వద్దు

**మీనం:**
పాత ఆర్థిక బాధ్యతలను సరిదిద్దుకోవాలి. నెమ్మదిగా సాగుతున్నా నిరుత్సాహపడవద్దు. అనుభవజ్ఞుల సలహాతో పనిలో అడ్డంకులను అధిగమించి మంచి పురోగతి సాధిస్తారు..



# కేబీఆర్ వన్-వేలో తొలిరోజే ట్రాఫిక్ కష్టాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ చుట్టూ జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా పోలీసులు అమలు చేసిన 'వన్‌వే' విధానంతో తొలిరోజే వాహనదారులకు చుక్కలు కనిపించాయి. ముందస్తు ప్రణాళిక లోపించడంతో ముఖ్యంగా రోడ్ నంబర్ 12తో పాటు ఇతర మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడి.. ఉద్యోగులు, అంబులెన్సులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికులకు ఆటంకం కలగకుండా ఆర్టీసీ బస్‌స్టాప్‌ల స్థానాలను మార్చే అంశంపై అధికారులతో చర్చిస్తున్నామని సీపీ సజ్జనార్ వెల్లడించారు. త్వరలోనే ఈ పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.కొత్త ట్రాఫిక్ మళ్లింపుల ప్రకారం.. పంజాగుట్ట నుంచి వచ్చే వాహనాలు కేబీఆర్ ఎంట్రెన్స్ వద్ద క్యాన్సర్ ఆసుపత్రి వైపు ఎడమకు మళ్లాలి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వెళ్లే వాహనాలకు మాత్రమే నేరుగా వెళ్లేందుకు అనుమతి ఉంది. రోడ్ నం. 45 నుంచి వచ్చేవి చెక్‌పోస్టు వైపు మాత్రమే వెళ్లాలి. అలాగే, రోడ్ నం. 12 నుంచి వచ్చే వాహనాలకు అగ్రసేన్ సర్కిల్ వద్ద రైట్ టర్న్ తీసుకునే అవకాశం లేదు. కేబీఆర్ పార్క్ చుట్టూ సుమారు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల పాటు ఈ వన్‌వే నిబంధనలు అమలులో ఉంటాయని, ఎవరైనా రాంగ్ రూట్‌లో వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# నర్సంపేట బంద్‌కు ఎర్రబెల్లి పిలుపు

**నర్సంపేట (ఏడీఎన్ఎన్) :**

దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కూల్చివేత, అలాగే నియోజకవర్గానికి చెందిన ముఖ్య బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ.. ఈ నెల 19న నర్సంపేట నియోజకవర్గ బంద్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ బంద్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.నియోజకవర్గ పరిధిలోని నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ తదితర ఆరు మండలాల్లో ఈ బంద్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరుతున్నాయి. ప్రజా నాయకుడికి జరిగిన అవమానానికి నిరసనగా చేపట్టే ఈ బంద్‌కు వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు, విద్యాసంస్థల నిర్వాహకులు, రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి సహకరించాలని బీఆర్ఎస్ స్థానిక నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో.. 19న చేపట్టనున్న ఈ బంద్ స్థానికంగా తీవ్ర రాజకీయ ఉత్కంఠను రేపుతోంది.




# డ్యూటీ కావాలా అయితే గదికి రా..

**కర్నూలు (ఏడీఎన్ఎన్) :**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శానిటేషన్ కాంట్రాక్ట్ పొందిన పద్మావతి శానిటేషన్ ఏజెన్సీ యాజమాన్యంపై తీవ్రస్థాయిలో లైంగిక, మానసిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తాయి. 'ఫోన్ మాట్లాడాననే నెపంతో అకారణంగా నన్ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. జీవనోపాధి కోసం తిరిగి ఉద్యోగం ఇవ్వాలని వేడుకుంటే మేనేజర్ తన గదికి రమ్మని కోరాడు. నేను అలాంటి దాన్ని కాదనడంతో వేరే ఎవరినైనా తీసుకురావాలంటూ దారుణంగా వేధిస్తున్నారు' అని బాధితురాలైన ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలను ఈ విధంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఏజెన్సీ వైఖరికి నిరసనగా తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ఏజెన్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల క్రితం సస్పెండ్ అయిన సదరు బాధిత మహిళ మాట్లాడుతూ.. ఏజెన్సీ మేనేజర్లు చెప్పినట్టు వినకపోతే ఉద్యోగులను వేధించడమే కాకుండా తీవ్రమైన పని ఒత్తిడికి గురిచేస్తున్నారని వాపోయారు. కొంతమంది మహిళా కార్మికులతో అధికారులు తమ సొంత ఇళ్లల్లో పనులు చేయించుకుంటున్నారని, ఈ అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైనే అబద్ధపు ప్రచారాలు చేస్తూ ఉద్యోగాల నుంచి తీసివేస్తున్నారని ఆరోపించారు. తెలుగు యువత రాష్ట్ర నేత జూటూరు రవికుమార్ మాట్లాడుతూ.. శానిటేషన్ ఏజెన్సీ మేనేజర్లు రత్నరాజు, రమణ , మీడియేటర్ హరిప్రసాద్‌తో మహిళల సమస్యలపై మాట్లాడేందుకు తమ బృందం వెళ్లేందుకు ప్రయత్నించిందన్నారు. అయితే, వారు తమ కార్యాలయ ఫర్నీచర్‌ను తామే స్వయంగా పగులగొట్టుకుని, ఎదురు తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు దిగారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు బంధువు అని చెప్పుకుంటూ, ఈ ఏజెన్సీ నిర్వాహకులు అందరినీ బెదిరిస్తూ తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# డంపింగ్ మట్టిలో బయటపడిన 4 మృతదేహాలు, 9 పుర్రెలు

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

విశాఖపట్నం పరిధిలోని గాజువాకలో తీవ్ర దిగ్భ్రాంతికర ఘటన వెలుగు చూసింది. స్థానికంగా ఒక ఖాళీ స్థలంలో డంప్ చేసిన మట్టి కుప్పల్లోంచి వరుసగా మృతదేహాలు, పుర్రెలు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. ఇప్పటివరకు నిర్వహించిన పరిశీలనలో ఏకంగా 4 మృతదేహాలు, 9 మానవ పుర్రెలు బయటపడినట్లు అధికారులు ధృవీకరించారు. వీటితో పాటు అంత్యక్రియలకు ఉపయోగించే పూలమాలలు, తెల్లటి వస్త్రాలు, దుప్పట్లు కూడా లభించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం ప్రకారం.. షీలానగర్‌సబ్బవరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనులు,సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. అందుకోసం లారీల్లో తీసుకొచ్చిన మట్టిని గాజువాకలోని ఈ ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయం దాటిన తర్వాత లారీల ద్వారా మట్టిని తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు కార్మికులు చెబుతున్నారు. ఏదైనా పాత శ్మశాన వాటిక ప్రాంతం నుంచి తవ్విన మట్టిని యథాతథంగా ఇక్కడికి తరలించి డంప్ చేసి ఉంటారని గట్టిగా అనుమానిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రారంభంలో రెండు మృతదేహాలు, పూజా సామాగ్రి మాత్రమే బయటపడగా, తవ్వేకొద్దీ మొత్తం 4 మృతదేహాలు, 9 పుర్రెలు బయటపడ్డాయని సీఐ తెలిపారు. ఈ మట్టిని ఏ ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటిక నుంచి తవ్వి తీసుకొచ్చారు? అర్ధరాత్రి వేళ లారీలలో ఎవరు రవాణా చేశారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. నిందితులను, బాధ్యులైన కాంట్రాక్టర్లను గుర్తించేందుకు మార్గమధ్యంలో ఉన్న ప్రధాన సిసిటివి ఫుటేజీలను పోలీసులు తీవ్రంగా పరిశీలిస్తున్నారు.



# అంపైర్‌కు తగిలిన బంతి.. ఐసీయూకు తరలింపు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

క్రికెట్ మైదానంలో మరో అపశ్రుతి చోటుచేసుకుంది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నీలో బ్యాటర్ బలంగా కొట్టిన బంతి నేరుగా ఫీల్డ్ అంపైర్ తలకు తాకడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అంపైర్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. న్యూఢిల్లీ టైగర్స్, ఈస్ట్ ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**తప్పించుకునే లోపే.. తలకే తగిలింది**

న్యూఢిల్లీ టైగర్స్ ఇన్నింగ్స్ లో 18వ ఓవర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆ జట్టు బ్యాటర్ లక్ష్య తరేజా అత్యంత వేగంగా పవర్‌ఫుల్ స్ట్రెట్ డ్రైవ్ ఆడాడు. ఆ బంతి నేరుగా మెయిన్ అంపైర్ ధర్మేశ్ భరద్వాజ్ వైపు దూసుకొచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన అంపైర్ వెంటనే కిందకు వంగి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, బంతి వేగం ఎక్కువగా ఉండటంతో అది ఆయన చెవి భాగాన్ని బలంగా తాకింది. వెంటనే మైదానంలోకి వచ్చిన ఫిజియోలు అంపైర్‌ను పరిశీలించి, చికిత్స కోసం బయటకు పంపించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. కాగా, అంపైర్‌ను గ



# మెటాపై ట్రిలియన్ డాలర్ల దావా

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

సోషల్ మీడియా దిగ్గజం మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) సంస్థ లక్ష్యంగా అమెరికాలోని పలు రాష్ట్రాలు వేసిన భారీ పరిహారం కేసు విచారణ ఓక్లాండ్ లోని ఫెడరల్ కోర్టులో ఘనంగా ప్రారంభమైంది. కాలిఫోర్నియా, కొలరాడో, కెంటుకీ, న్యూజెర్సీ రాష్ట్రాలకు చెందిన అటార్నీ జనరల్స్ దాఖలు చేసిన ఈ కేసులో రాష్ట్రాల తరపు న్యాయవాదులు మొదట దాదాపు 200 బిలియన్ డాలర్ల పరిహారం కోరగా, మొత్తం జరిమానాలు , పరిహారం కలిపి ఏకంగా 1.4 ట్రిలియన్ డాలర్ల (రూ. 115 లక్షల కోట్లకు పైగా) వరకు చేరు కోవచ్చని మెటా కోర్టు పత్రాల్లో పేర్కొంది. ఈ స్థాయిలో పరిహారం కోరడాన్ని మెటా అసాధారణమైనదిగా అభివర్ణించింది. 2023లో బహుళ రాష్ట్రాల సమగ్ర విచారణ తర్వాత ఈ దావా నమోదైంది. యువత ,చిన్నారులను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో గంటల తరబడి కట్టిపడేసేందుకు ఇన్ఫినిట్ స్క్రోలింగ్, ఆటోప్లే, లైక్స్,పుష్ నోటిఫికేషన్ల వంటి మానసికంగా ప్రభావితం చేసే అడిక్టివ్ ఫీచర్లను మెటా ఉద్దేశపూర్వకంగానే డిజైన్ చేసిందని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. ఈ యాప్‌ల వల్ల యువతలో ఆందోళన , డిప్రెషన్, మానసిక క్షోభ, ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతున్నాయని అంతర్గత పరిశోధనల్లో తెలిసినప్పటికీ, తమ ప్లాట్‌ఫామ్‌లు సురక్షితమైనవేనని మెటా తప్పుదోవ పట్టించిందని వాదిస్తున్నాయి. అంతేకాకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత డేటాను సేకరించి, చిన్నారుల ఆన్‌లైన్ గోప్యతా పరిరక్షణ చట్టాన్ని మెటా తీవ్రంగా ఉల్లంఘించిందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ కీలక విచారణలో భాగంగా మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఇన్‌స్టాగ్రామ్ చీఫ్ ఆడమ్ మొసేరీ కోర్టులో నేరుగా సాక్ష్యం చెప్పనుండటం విశేషం. అయితే "సోషల్ మీడియా అడిక్షన్" అనేది అధికారికంగా గుర్తించబడిన మానసిక వ్యాధి కాదని, తాము యూజర్ల భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్నామని మెటా కోర్టులో వాదిస్తోంది. ఇప్పటికే లాస్ ఏంజిల్స్, న్యూమెక్సికో కోర్టుల్లో జరిగిన ఇలాంటి కేసుల్లో జ్యూరీలు మెటాకు వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వగా, వాటిపై కంపెనీ అప్పీలుకు వెళ్లనుంది. గతంలో సిగరెట్ కంపెనీలపై దాఖలైన 'బిగ్ టొబాకో' కేసుల తరహాలోనే, ఈ దావా కూడా సోషల్ మీడియా రంగానికి అత్యంత కీలకమైన మలుపుగా మారనుందని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. ఈ విచారణ సుమారు ఆరు వారాల పాటు కొనసాగనుంది.

# వరుసగా నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర రాజకీయ అనిశ్చితి కారణంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్, రియాల్టీ విభాగాలకు చెందిన స్టాక్స్ లో తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ప్రధానంగా హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ ఐటీ షేర్లు దాదాపు 2 శాతం వరకు కుంగిపోయాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా మూడో రోజు, నిఫ్టీ ఏకంగా ఆరో రోజు కూడా నష్టాల బాటలోనే పయనించాయి. మంగళవారం ఉదయం సెన్సెక్స్ 77,418.97 పాయింట్ల వద్ద నష్టాలతోనే ప్రారంభమైంది. రోజంతా సూచీపై తీవ్రమైన ఒత్తిడి కొనసాగగా, ఇంట్రాడేలో 77,234.36 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు సెన్సెక్స్ 492.70 పాయింట్లు క్షీణించి 77,235.46 వద్ద ముగిసింది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 132.75 పాయింట్లు నష్టపోయి 24,154.90 వద్ద స్థిరపడింది. అమెరికన్ డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.68 వద్ద కొనసాగుతోంది. సూచీ నష్టాల్లో ఉన్నప్పటికీ, సెన్సెక్స్ 30 ప్యాక్‌లో యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ వంటి పరిమిత షేర్లు మాత్రమే లాభపడగా, మిగిలిన ప్రధాన కంపెనీల షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. ఇక అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 90.94 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, పసిడి ధర ఔన్సుకు 4,394.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# క్రీడాకారులకు 'అర్జున 'పురస్కారాలు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)



దేశంలో ప్రతిష్ఠాత్మకమైన జాతీయ క్రీడా పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2025 సంవత్సరానికి గాను వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 17 మంది క్రీడాకారులను 'అర్జున' అవార్డులు వరించాయి. అయితే, దేశంలోనే అత్యున్నత క్రీడా పురస్కారమైన 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డును మాత్రం ఈసారి ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ తొలుత స్టార్ హాకీ ప్లేయర్ హార్దిక్ సింగ్ పేరును ఖేల్‌రత్న కోసం పరిశీలించినప్పటికీ.. చివరికి ఆయన ఆ రేసు నుంచి తప్పుకోవడంతో ఈ ఏడాది ఎవరికీ అత్యున్నత పురస్కారం దక్కలేదు. అంతర్జాతీయ వేదికలపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన పలువురు యువ క్రీడాకారులకు ఈసారి అర్జున అవార్డుల్లో పెద్దపీట వేశారు. అథ్లెటిక్స్ విభాగంలో తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్ వి, ప్రియాంక గోస్వామిలు ఎంపికవగా.. బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్‌లను అర్జున వరించింది. చెస్‌లో ప్రపంచ వేదికపై సత్తా చాటిన విదిత్ సంతోష్ గుజరాతి, దివ్యా దేశ్‌ముఖ్‌లతో పాటు బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్, హాకీలో లాల్‌రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్, కబడ్డీలో సుర్జీత్, పూజ, రోయింగ్‌లో అరవింద్ సింగ్, షూటింగ్‌లో అఖిల్ షియోరాన్‌లు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇక పారా క్రీడల విభాగంలో ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్), ఏక్తా భ్యాన్ (పారా అథ్లెటిక్స్)లు అర్జున అవార్డులు సాధించారు. ఫుట్‌బాల్ మాజీ ఆటగాడు అరుమై నాయగంను కేంద్రం 'లైఫ్‌టైమ్ అర్జున' అవార్డుతో సత్కరించింది. క్రీడాకారులను ఛాంపియన్లుగా తీర్చిదిద్దిన ఉత్తమ కోచ్‌లకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'ద్రోణాచార్య' పురస్కారాలను కూడా ఎంపిక కమిటీ వెల్లడించింది. రెగ్యులర్ విభాగంలో బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్‌లు ద్రోణాచార్య అవార్డుకు ఎంపికయ్యారు. ఇక లైఫ్‌టైమ్ విభాగంలో ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్), వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)లకు ద్రోణాచార్య పురస్కారాలు దక్కాయి.

# గాలే టెస్టులో విజయానికి 6 వికెట్ల దూరంలో భారత్

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)



శ్రీలంక గడ్డపై జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా పట్టుబిగించింది. గాలే వేదికగా భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి.. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్ లో 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లంక బ్యాటర్లు భారత బౌలర్ల ముందు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**తడబడిన లంక టాప్ ఆర్డర్**

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. భారత బౌలర్ల కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ దెబ్బకు.. ఓపెనర్లు నిశాన్ మదుశంక (6), లాహిరు ఉదారా (16)తో పాటు పసిందు సూర్యబందరా (0), కమిందు మెండిస్ (2) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. ప్రస్తుతం క్రీజులో ధనంజయ డిసెల్వా (31 బ్యాటింగ్), సోనల్ దినూశ (25 బ్యాటింగ్) పోరాడుతున్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2 వికెట్లు పడగొట్టగా.. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలొక వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

**పంత్, పడిక్కల్ రాణింపు**

అంతకుముందు, మంగళవారం తమ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియా 193 పరుగులకు ఆలౌటైంది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ (66) అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతనికి తోడుగా దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కీలక ఇన్నింగ్స్ ఆడారు. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, ప్రభాత్ జయసూర్య చెరో 3 వికెట్లు పడగొట్టగా.. లాహిరు కుమార 2, కేశర ఒక వికెట్ తీశారు.

**విజయ సమీకరణం**

టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ లో 178 పరుగుల భారీ ఆధిక్యం లభించిన విషయం తెలిసిందే. ఆ ఆధిక్యానికి రెండో ఇన్నింగ్స్ పరుగులను కలుపుకుని శ్రీలంకకు 372 పరుగుల భారీ టార్గెట్‌ను నిర్దేశించింది. బుధవారం ఐదో రోజు ఆటలో శ్రీలంక విజయానికి ఇంకా 288 పరుగులు అవసరం కాగా.. భారత్ గెలుపునకు కేవలం 6 వికెట్లు మాత్రమే కావాలి. మ్యాచ్ ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే భారత్ విజయం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది.

# ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు బాబర్ ఆజమ్ దూరం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)



ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్‌కు ముందు పాకిస్తాన్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్, కెప్టెన్ బాబర్ ఆజమ్ గాయం కారణంగా బుధవారం ప్రారంభం కానున్న తొలి టెస్టుకు దూరమయ్యాడు. హెడ్డింగ్లీ వేదికగా జరగనున్న ఈ కీలక మ్యాచ్‌లో బాబర్ అందుబాటులో లేకపోవడం పాక్ బ్యాటింగ్ లైనప్‌కు తీవ్ర లోటుగా మారింది.బాబర్ ఆజమ్ కుడి చేతి మధ్య వేలికి తీవ్ర గాయమైందని పాకిస్తాన్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించాడు. వేలికి ఎలాంటి ఫ్రాక్చర్ కాలేదని స్పష్టం చేసిన ఆయన.. నొప్పి ఎక్కువగా ఉన్న కారణంగానే తొలి టెస్టు నుంచి విశ్రాంతి ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం బాబర్ వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నాడని, రెండో టెస్టు ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నందున అప్పటికి అతడు పూర్తిగా కోలుకుంటాడని ఆశిస్తున్నట్లు కోచ్ పేర్కొన్నాడు.బాబర్ గైర్హాజరీలో పాక్ టెస్టు జట్టు పగ్గాలను ఆల్‌రౌండర్ సల్మాన్ అలీ అఘా చేపట్టనున్నాడు. టెస్టు క్రికెట్‌లో నాయకుడిగా అతడికి ఇదే తొలి మ్యాచ్ కావడం గమనార్హం. గతంలో అంతర్జాతీయ స్థాయిలో పాక్ టీ20 జట్టుకు నాయకత్వం వహించిన సల్మాన్‌కు.. 2013 నుంచే దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన అపార అనుభవం ఉంది. 2022లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఈ 32 ఏళ్ల ఆటగాడు.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, ఆఫ్ స్పిన్నర్‌గా జట్టులో కీలక పాత్ర పోషిస్తున్నాడు.ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో బాబర్ ఆజమ్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్10లోకి ప్రవేశించాడు. ఆ సిరీస్‌లో తొలి టెస్టులో 88 పరుగులు, రెండో టెస్టులో అజేయంగా 24 పరుగులు చేసి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించాడు. మంచి ఫామ్‌లో ఉన్న బాబర్.. ఇంగ్లండ్ లాంటి కఠినమైన పరిస్థితుల్లో జట్టుకు దూరం కావడం ఆ జట్టు అవకాశాలపై ప్రభావం చూపనుంది. ఇప్పుడు బాబర్ లేకుండా తొలి టెస్టులోపాకిస్తాన్ ను సల్మాన్ అలీ అఘా ఎలా నడిపిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

# డేవిడ్ వార్నర్‌కు 1,500 డాలర్ల జరిమానా

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)



ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు డ్రంకెన్ డ్రైవ్ కేసులో సిడ్నీ న్యాయస్థానం షాకిచ్చింది. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో వార్నర్‌ను దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం.. అతడికి 1,500 ఆస్ట్రేలియన్ డాలర్ల జరిమానా విధించింది. అంతేకాకుండా, ఇకపై వాహనం నడపాలంటే కారులో తప్పనిసరిగా 'ఆల్కో ఇంటర్‌లాక్' పరికరాన్ని అమర్చుకోవాలని ఆదేశించింది.39 ఏళ్ల డేవిడ్ వార్నర్ ఏప్రిల్ 5న సిడ్నీలో వాహనం నడుపుతూ పోలీసుల ర్యాండమ్ బ్రీత్ టెస్టింగ్‌లో పట్టుబడ్డాడు. ఆ పరీక్షలో అతడి శరీరంలో అనుమతించిన పరిమితి కంటే రెండింతలకు పైగా ఆల్కహాల్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో వార్నర్ గత నెలలోనే తన తప్పును న్యాయస్థానం ముందు అంగీకరించాడు.మద్యం తాగి వాహనం నడుపుతున్న సమయంలో కారులో చిన్నారులు కూడా ఉన్నారని న్యాయస్థానం గుర్తించింది. ఈ అంశం అతడు చేసిన నేరాన్ని మరింత తీవ్రమైనదిగా మార్చిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి చర్యలను ఉపేక్షించలేమని స్పష్టం చేశారు. అయితే వార్నర్ డ్రైవింగ్‌పై పూర్తిస్థాయి నిషేధం విధించకుండా.. ప్రత్యేకంగా 'ఇంటర్‌లాక్ లైసెన్స్' కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కారులో అమర్చే ఈ పరికరం డ్రైవర్ శ్వాసలోని ఆల్కహాల్ శాతాన్ని గుర్తిస్తుంది. ఒకవేళ మద్యం తాగినట్లు తేలితే వాహనం స్టార్ట్ కాకుండా నిలిపివేస్తుంది. పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ జట్టుకు సారథ్యం వహించిన వార్నర్.. ఈస్టర్ విరామ సమయంలో స్వదేశానికి వచ్చినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రస్తుతం న్యాయస్థానంలో దోషిగా తేలడంతో రాబోయే బిగ్ బాష్ లీగ్ (BBL) సీజన్‌లో సిడ్నీ థండర్ జట్టు కెప్టెన్‌గా అతడి కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ తీర్పు వార్నర్ భవిష్యత్ టీ20 ఫ్రాంచైజీ లీగ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

# 90 నిమిషాల్లోనే'సన్‌షైన్ పిక్చర్స్'ఐపీఓ బిడ్డింగ్..

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)




ప్రముఖ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ విపుల్ షాకు చెందిన 'సన్‌షైన్ పిక్చర్స్' ఐపీఓకు మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన తొలి 90 నిమిషాల్లోనే బిడ్డింగ్ ప్రక్రియ పూర్తయి రికార్డు సృష్టించింది. ఎన్ఎస్ఈ అందుబాటులో ఉంచిన డేటా ప్రకారం.. కంపెనీ ఆఫర్ చేసిన 54.59 లక్షల షేర్లకు గానూ, దాదాపు 54.86 లక్షల బిడ్లు దాఖలయ్యాయి. ఇందులో రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 1.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 1.16 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది. కాగా, ఈ కంపెనీ ఐపీఓ కంటే ముందే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 84.64 కోట్ల నిధులను సమీకరించినట్లు తెలిపింది.సన్‌షైన్ పిక్చర్స్ సంస్థ మొత్తం రూ. 282 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో మంగళవారం ఐపీఓను ప్రారంభించగా, ఆగస్టు 20తో బిడ్డింగ్ గడువు ముగియనుంది. కంపెనీ తన షేరు ప్రైస్ బ్యాండ్‌ను రూ. 342 నుంచి రూ. 360గా నిర్ణయించింది. ఈ ఐపీఓ ద్వారా 48 లక్షల తాజా (ఫ్రెష్) షేర్లను విక్రయించడంతో పాటు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో మరో 30.37 లక్షల షేర్లను విక్రయానికి ఉంచారు. కంపెనీ ప్రమోటర్లయిన విపుల్ అమృతలాల్ షా, షెఫాలీ విపుల్ షా తమ వాటాలను OFS రూపంలో విక్రయిస్తున్నారు. బిడ్డింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత , ఈ కంపెనీ షేర్లు ఆగస్టు 25న స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి.మరోవైపు డెయిరీ ఉత్పత్తుల తయారీ సంస్థ 'మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్' స్టాక్ మార్కెట్‌లో మదుపర్లకు ఊహించినట్టే మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో దాదాపు 18 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఈ ఐపీఓ ఇష్యూ ధర రూ. 140గా ఉండగా, బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో 18 శాతం లాభంతో రూ. 165 వద్ద షేర్లు శుభారంభం చేశాయి. ట్రేడింగ్ ఇంట్రాడేలో మరింత జోరు అందుకుని ఏకంగా 29.60 శాతం పెరిగి రూ. 181.45 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 13,968.81 కోట్లకు చేరింది.గతంలో ప్రారంభమైన ఈ మిల్కీ మిస్ట్ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి విశేష ఆదరణ లభించింది. సబ్‌స్క్రిప్షన్ చివరి రోజు నాటికి ఏకంగా 56.12 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. రూ. 1,553 కోట్ల నిధులను సేకరించేందుకు గానూ కంపెనీ ఆగస్టు 11న ఐపీఓను ప్రారంభించగా, ఆగస్టు 13 నాటికి సబ్‌స్క్రిప్షన్ ముగిసిన విషయం తెలిసిందే.

# ముడిసరుకుల భారంతో కోల్గేట్ ధరల పెంపు?

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ప్రముఖ ఎఫ్ఎంసీజీ దిగ్గజం కోల్గేట్‌పామోలివ్ తన ఉత్పత్తుల ధరలను పెంచేందుకు సమాయత్తమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా ముడిసరుకుల రవాణా వ్యయం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. పెరుగుతున్న వ్యయ భారం నుంచి కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకే రానున్న త్రైమాసికాల్లో ఈ ధరల పెంపు నిర్ణయం అనివార్యమైందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ అంశంపై కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభా నరసింహన్ స్పందిస్తూ.. "గతంలో జీఎస్టీ సవరణల సమయంలో ధరలు మార్చకుండా ఉత్పత్తుల పరిమాణాన్ని పెంచి వినియోగదారులకు అందించాం. ప్రస్తుతం రూ.10, రూ.20 ధరల విభాగాల్లోనూ కోల్గేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. అయితే పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ముడిసరుకుల సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పుడు గనుక ఉత్పత్తుల ధరలను సవరించకపోతే భవిష్యత్తులో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తట్టుకోవడం కష్టమవుతుంది," అని స్పష్టం చేశారు. అలాగే భవిష్యత్తు వ్యూహాల్లో భాగంగా టూత్ బ్రష్‌లు, టూత్ పేస్ట్ ల విభాగాస్తులలో ప్రీమియం ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు తమ పర్సనల్ కేర్ బ్రాండ్ 'పామోలివ్' మార్కెట్ పనితీరుపై ప్రభా నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్సనల్ కేర్ విభాగంలో బ్రాండ్ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు గాను 'బాంబే షేవింగ్ కంపెనీ'తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. భారత మార్కెట్‌లో ప్రస్తుతం కోల్గేట్ కంపెనీ.. పతాంజలి, హేలియోన్ సంస్థకు చెందిన సెన్సోడైన్, అలాగే హిందూస్థాన్ యునిలీవర్‌కు చెందిన పెప్సోడెంట్ వంటి దిగ్గజ బ్రాండ్ల నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది.



# మరో క్రికెట్ లీగ్‌లోకి నైట్ రైడర్స్

## షారుక్ ఖాన్ మాస్టర్ ప్లాన్ ఇదేనా?

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్‌కు చెందిన నైట్ రైడర్స్ గ్రూప్ తన క్రికెట్ సామ్రాజ్యాన్ని మరింత విస్తరించే పనిలో పడింది. ఇప్పటికే భారత్ సహా పలు దేశాల్లో ఫ్రాంచైజీలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ గ్రూప్.. ఇప్పుడు ఇంగ్లండ్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక 'ది హండ్రెడ్' లీగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోందన్న వార్తలు క్రీడా వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.ప్రస్తుతం 'ది హండ్రెడ్' టోర్నీలో ఎనిమిది జట్లు ఉన్నాయి. గతేడాది ఈ ఫ్రాంచైజీల్లో వాటాల విక్రయానికి బిడ్డింగ్ నిర్వహించగా.. నైట్ రైడర్స్ గ్రూప్ కూడా అందులో పాల్గొంది. అందులో భాగంగా 'ట్రెంట్ రాకెట్స్' జట్టులో వాటా కొనుగోలు చేసేందుకు షారుక్ బృందం ఆసక్తి చూపినప్పటికీ, ఫ్రాంచైజీ వాల్యుయేషన్ (విలువ) ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని భావించి చివరి నిమిషంలో బిడ్డింగ్ నుంచి తప్పుకుంది. ఆ తర్వాత ఆ జట్టులో 49 శాతం వాటాను చెల్సియా ఫుట్‌బాల్ క్లబ్ సహ యజమాని టాడ్ బోహ్లీ, బ్రిటిష్ వ్యాపారవేత్త జొనాథన్ గోల్డ్ స్టీన్ నేతృత్వంలోని కన్సార్టియం 40 మిలియన్ పౌండ్ల కంటే తక్కువ మొత్తానికి సొంతం చేసుకుంది.

**10 జట్లకు విస్తరిస్తే.. మళ్లీ రంగంలోకి!**

అయితే, భవిష్యత్‌లో ది హండ్రెడ్ లీగ్‌ను 8 జట్ల నుంచి 10 జట్లకు విస్తరించాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ECB) యోచిస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, నైట్ రైడర్స్ గ్రూప్ కొత్త ఫ్రాంచైజీ కోసం కచ్చితంగా బరిలోకి దిగుతుందని సమాచారం. ప్రస్తుత మీడియా హక్కుల ఒప్పందం 2028 వరకు ఉండటంతో, ఆ లోపే కొత్త జట్ల చేరిక ఉండకపోవచ్చని తెలుస్తోంది. కొత్తగా రెండు జట్లు వస్తే డర్హామ్‌తో పాటు బ్రిస్టల్ లేదా టాంటన్ కేంద్రంగా ఆ జట్లను ఏర్పాటు చేసే అవకాశాలను బోర్డు పరిశీలిస్తోంది. జట్ల సంఖ్య పెరిగితే సహజంగానే లీగ్ మీడియా హక్కుల విలువ కూడా భారీగా పెరగనుంది.

**ప్రపంచవ్యాప్తంగా నైట్ రైడర్స్ సామ్రాజ్యం**

గ్లోబల్ క్రికెట్ రంగంలో నైట్ రైడర్స్ గ్రూప్ (కేఆర్జీ) ఇప్పటికే తిరుగులేని పవర్ హౌస్‌గా అవతరించింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో 'కోల్‌కతా నైట్ రైడర్స్'తో మొదలైన ఈ విజయ ప్రస్థానం దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో 'ట్రిన్‌బాగో నైట్ రైడర్స్', అమెరికా మేజర్ లీగ్ క్రికెట్‌లో 'లాస్ ఏంజెల్స్ నైట్ రైడర్స్', అలాగే యూఏఈ ఇంటర్నేషనల్ లీగ్‌లో 'అబుదాబి నైట్ రైడర్స్' పేర్లతో ప్రముఖ ఫ్రాంచైజీలను విజయవంతంగా నడుపుతోంది. అంతేకాకుండా, సొంతంగా అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ స్పోర్ట్స్ బ్రాండ్‌గా చరిత్ర సృష్టిస్తూ, అమెరికాలోని లాస్ ఏంజెల్స్ లో అత్యాధునిక 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్'ను కూడా ఈ ఏడాదే ప్రారంభించింది. తాజాగా ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లోకి కేఆర్జీ ఎంట్రీపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఆ టోర్నీని 10 జట్లకు విస్తరిస్తే మాత్రం షారుక్ ఖాన్‌కు చెందిన నైట్ రైడర్స్ బ్రాండ్ ఇంగ్లండ్ గడ్డపై కూడా అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.


# వాయిదా పడిన టాటా సన్స్ ఏజీఎం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

టాటా గ్రూప్‌నకు చెందిన హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ 108వ వార్షిక సాధారణ సమావేశం ఆగస్టు 18న జరగాల్సి ఉండగా, అవసరమైన కోరం లేకపోవడంతో తొలిసారిగా వాయిదా పడింది. టాటా గ్రూప్ సుదీర్ఘ చరిత్రలోనే ఒక ఏజీఎం కోరం కొరత వల్ల వాయిదా పడటం ఇదే ప్రథమం. కంపెనీ నిబంధనల ప్రకారం సమావేశాన్ని చట్టబద్ధంగా నిర్వహించడానికి ఉండాల్సిన కనీస సభ్యులు లేదా వారి ప్రతినిధుల హాజరు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణమైంది.టాటా సన్స్ లో రెండు ప్రధాన ప్రమోటర్ ట్రస్టులైన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లకు ఉమ్మడిగా సుమారు 51.5 శాతం వాటా ఉంది. దీంతో ఈ రెండు ట్రస్టుల ఉమ్మడి ప్రతినిధి హాజరు ఏజీఎం నిర్వహణకు అత్యంత కీలకం. అయితే మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ సర్ రతన్ టాటా ట్రస్ట్‌కు చెందిన సమావేశాలు, నిర్ణయాలపై ఆంక్షలు విధించడంతో, రెండు ట్రస్టులు కలిసి తమ ఉమ్మడి ప్రతినిధిని నామినేట్ చేయలేకపోయాయి. ఫలితంగా సమావేశానికి అవసరమైన కోరం ఏర్పడలేదు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమైన ఏజీఎం, కోరం లభించకపోవడంతో అర్ధగంటలోనే అంటే 3:00 గంటలకు వాయిదా పడింది. టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, బోర్డు సభ్యులు సౌరభ్ అగర్వాల్, అనితా మరంగోలీ జార్జ్ బొంబాయి హౌస్‌లో ప్రత్యక్షంగా హాజరయ్యారు. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, హరీష్ మన్వానీ, వేణు శ్రీనివాసన్ తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు. అలాగే రతన్ టాటా విల్‌కు ఎగ్జిక్యూటర్‌గా ఉన్న మాజీ టాటా గ్రూప్ ఇన్‌సైడర్ మెహ్లీ మిస్త్రీ కూడా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఏజీఎం రద్దు కాలేదని, కేవలం సాంకేతిక కారణాల (కోరం లేకపోవడం) వల్ల మాత్రమే వాయిదా పడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. టాటా సన్స్ బోర్డు త్వరలోనే సమావేశమై ఏజీఎంను తిరిగి ఎప్పుడు నిర్వహించాలనే దానిపై కొత్త తేదీని ఖరారు చేయనుంది. ప్రస్తుతం టాటా ట్రస్టుల పరిపాలనలో ఎదురవుతున్న న్యాయపరమైన విచారణలు, ఆంక్షలు నేరుగా టాటా సన్స్ నిర్వహణపై కూడా ప్రభావం చూపుతున్నాయనే విషయానికి ఈ పరిణామం అద్దం పడుతోంది.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
19.08.2026
www.manasarkar.com




# వెంకీ అట్లూరి దర్శకత్వంలో ల్యాండ్‌మార్క్ మూవీ?

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అక్కినేని నాగచైతన్య తన కెరీర్‌లో అత్యంత కీలకమైన 25వ (NC25) మైలురాయి చిత్రానికి సిద్ధమవుతున్నారు. 'తండేల్' సక్సెస్ తర్వాత, ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో మిస్టరీ అడ్వెంచర్‌గా తెరకెక్కుతున్న 'వృషకర్మ'లో ఆయన నటిస్తున్నారు. ఈ భారీ విజువల్ వండర్ తర్వాత రాబోయే చైతూ 25వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే చైతూ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌ను హ్యాట్రిక్ హిట్ల దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించనున్నారని ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ నిర్మాణంలో ఈ కాంబినేషన్ కుదిరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 'సార్', 'లక్కీ భాస్కర్', 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న వెంకీ అట్లూరి, కేవలం స్కేల్ పెంచడం కంటే బలమైన కథ, ఎమోషన్లకే ప్రాధాన్యమిస్తారు. గతంలో తాను రాసుకున్న కథలను ముందుగా చైతన్యకే వినిపించేవాడినని వెల్లడించిన వెంకీ, ఇప్పుడు చైతూ 25వ చిత్రం కోసం ఎలాంటి కథను తీసుకొస్తారనేది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వస్తే ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# నెటింట్లో టైటిళ్ల హల్ చల్...

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అనిల్ రావిపూడి దర్శకత్వంలో హ్యాట్రిక్ హిట్ల కాంబినేషన్‌గా తెరకెక్కనున్న భారీ మల్టీస్టారర్ చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా అలరించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతున్నప్పటికీ, మేకర్స్ ఇప్పటి వరకు అధికారికంగా టైటిల్‌ను ప్రకటించకపోవడంతో రకరకాల పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రారంభంలో ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ప్రచార చిత్రాన్ని లేదా టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు రాగా, చిత్ర బృందం స్పందించలేదు. తాజాగా ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కథలో వెంకటేష్‌కు కళ్యాణ్ రామ్ బావమరిదిగా కనిపిస్తారని తెలుస్తోంది. అందులో కళ్యాణ్ రామ్ పాత్ర పేరు 'బాల్‌రెడ్డి' కావడంతో ఈ చిత్రానికి 'బామ్మర్ది బాల్‌రెడ్డి' అనే క్యాచీ టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది. మరి మేకర్స్ ఈ రెండింటిలో ఒకదాన్ని ఖరారు చేస్తారా లేక సరికొత్త టైటిల్‌తో ముందుకు వస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సమర్పకులుగా వ్యవహరిస్తుండగా, జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# గ్లామరస్ లుక్‌తో కట్టిపడేస్తున్న రాశి ఖన్నా...

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టాలీవుడ్ అందాల భామ రాశి ఖన్నా సరికొత్త గ్లామరస్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. వింటేజ్, వింటర్‌చిక్ శైలిలో ఆమె పంచుకున్న లేటెస్ట్ ఫొటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఎరుపు రంగు శాలువాను టాప్‌లా స్టైల్ చేస్తూ, బ్లాక్ అండ్ వైట్ చెకర్డ్ మిడ్డీ స్కర్ట్‌లో రాయల్ ఎలిగెన్స్ తెచ్చిపెట్టేలా ఆమె మెరిసిపోయారు. సాఫ్ట్ వేవీ హెయిర్, క్లాసీ మేకప్‌తో రాశి ఇచ్చిన కిల్లింగ్ పోజులపై అభిమానులు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు గ్లామర్ షోతో కుర్రకారును అలరిస్తూనే, మరోవైపు చేతినిండా భారీ ప్రాజెక్టులతో ఈ భామ బిజీగా ఉన్నారు. ఇప్పటికే 'అగత్య', 'తెలుసు కదా', '120 బహదూర్', పవన్ కళ్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాల్లో నటించిన రాశి, రజనీకాంత్‌కు జోడీగా 'ధర్మన్' మూవీలోనూ కనిపించనున్నారు. అంతేకాకుండా, సూపర్ హిట్ వెబ్ సిరీస్ సీక్వెల్ 'ఫర్జీ 2' షూటింగ్‌లో మేఘా వ్యాస్ పాత్రలో పాల్గొంటున్నట్లు ఆమె స్వయంగా వెల్లడించారు. వైవిధ్యమైన సినిమాలు, అలరించే ఫొటోషూట్‌లతో రాశి ఖన్నా సోషల్ మీడియాను ఏలేస్తున్నారు.

# వైవిధ్యమైన కథలతో ఆనంద్ దేవరకొండ

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

యువ హీరో ఆనంద్ దేవరకొండ కథల ఎంపికలో సరికొత్త వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. 'బేబీ' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఒకే ఫార్ములాకు పరిమితం కాకుండా ప్రయోగాత్మక పాత్రలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలు నటుడిగా ఆయన పరిధిని మరింత విస్తరించేలా కనిపిస్తున్నాయి. యూత్‌ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు, విభిన్నమైన ఫోక్‌లోర్ థ్రిల్లర్ నేపథ్యంలో వస్తున్న 'తక్షకుడు' చిత్రంలో ఆనంద్ గిరిజన అంధుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. కథా స్వభావాన్ని బట్టి థియేటర్, ఓటీటీ విభజన చేసుకుంటూ ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తుండటం విశేషం. కమర్షియల్ ఇమేజ్ కంటే నటనకే ప్రాధాన్యమిస్తున్న ఈ విభిన్న ప్రయత్నాలు ఆనంద్ కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్తాయో లేదో వేచి చూడాలి.

# మాటలు జాగ్రత్త, క్షమాపణ చెప్పాల్సిందే!



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తెలుగు 'బిగ్ బాస్ సీజన్ 10' త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సామాన్యుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న 'అగ్నిపరీక్ష' కార్యక్రమం వివాదాలకు వేదికవుతోంది. ఈ షోలో జడ్జిగా వ్యవహరిస్తున్న బిగ్ బాస్ ఓటీటీ విజేత బిందు మాధవిపై మాజీ కంటెస్టెంట్ నటరాజ్ మాస్టర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో బిగ్ బాస్ హౌస్‌లో వీరిద్దరి మధ్య జరిగిన ఒక సంఘటనను ఉద్దేశించి అగ్నిపరీక్షలో ఓ పోటీదారుడు ప్రశ్నించగా, 'అలాంటి వాళ్లు కూడా ఉండాలి' అంటూ బిందు మాధవి వ్యాఖ్యానించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన నటరాజ్ మాస్టర్.. బిగ్ బాస్ ముగిసిన తర్వాత ఆ విషయాలన్నీ మర్చిపోయి, తన కూతురి పుట్టినరోజుకు కూడా బిందును ఆహ్వానించానని గుర్తుచేశారు. ఆ చేదు జ్ఞాపకాలను వదిలేసి ప్రశాంతంగా ఉంటున్న సమయంలో 'అలాంటి వాళ్లు' అని సంబోధించడం సరికాదని హితవు పలికారు. "అగ్నిపరీక్షలో పాల్గొనేవారికి నీతో అవసరం ఉండొచ్చు, కానీ నాకు లేదు. మాట్లాడేటప్పుడు మాటలు జాగ్రత్తగా ఉండాలి.. ఈ వ్యాఖ్యలకు బిందు మాధవి కచ్చితంగా క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నటరాజ్ మాస్టర్ చేసిన ఈ కౌంటర్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# RC17లో రామ్ చరణ్ సరసన సారా అర్జున్?

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం! గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, లెక్కల మాస్టార్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'RC17' చిత్రంపై చిత్రసీమతో పాటు అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరూ మళ్లీ కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రకటన నాటి నుంచే వార్తల్లో నిలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా సాగుతున్న ఈ సినిమాలో కథానాయికగా ఎవరు నటిస్తారనే దానిపై ఇప్పటికే పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు ప్రచారంలోకి రాగా, తాజాగా ఒక సరికొత్త రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. బాలీవుడ్ సంచలనం సారా అర్జున్‌ను ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ పరిశీలిస్తున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించి, ఇటీవల 'ధురంధర్' చిత్రంతో విశేష ఆదరణ పొందిన ఆమెకు సుకుమార్ ఇప్పటికే కథ వినిపించినట్లు సమాచారం. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే వెండితెరపై విజువల్ వండర్ ఖాయమని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన అధికారిక వివరాలు వెలువడే అవకాశం ఉంది.




# సూపర్ నేచురల్ థ్రిల్లర్‌లో క్రేజీ జోడీ!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బాలీవుడ్ కథానాయిక కియారా అద్వానీ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. గతంలో 'గేమ్ ఛేంజర్', 'వార్ 2' వంటి భారీ చిత్రాలతో మెప్పించిన ఆమె, త్వరలో 'టాక్సిక్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఖాతాలో మరొక క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వర్సటైల్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి ఆమె తొలిసారిగా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు సమాచారం. ఒక ఇంటెన్స్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథాంశంతో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి ప్రముఖ రచయిత్రి కనికా థిల్లాన్ దర్శకత్వం వహించనున్నారు. 'కేదార్‌నాథ్', 'హసీన్ దిల్‌రుబా', 'డంకీ' వంటి విభిన్న చిత్రాలకు కథలందించిన ఆమె, ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న పాత్రలను తీర్చిదిద్దడంలో సిద్ధహస్తురాలైన కనికా, ఈ సినిమాలో కియారా కోసం ఎంతో బలమైన, కొత్త తరహా పాత్రను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లోనే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# దేశాభిమానం 'అంధ భక్తి' అయితే నేను గర్వపడతా...



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతదేశాన్ని ప్రేమించడం, దేశ పురోగతిని ఆకాంక్షించడం 'అంధ భక్తి' అనుకుంటే, తాను గర్వంగా అంధ భక్తురాలినేనని బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె, తన విధేయత ఏ రాజకీయ పార్టీకి కాదు, కేవలం దేశానికి మాత్రమేనని తేల్చిచెప్పారు. 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతాన్ని నమ్మే తాను, తన దేశం కోసం నిలబడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. దేశం మనకేమి ఇచ్చిందనే ఆలోచన కంటే, దేశానికి మనమేం చేశామనే దృక్పథం యువతలో రావాలని ఆమె పిలుపునిచ్చారు. నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మంచిని మెచ్చుకునే, తప్పును ప్రశ్నించే హక్కు తనకు ఉందని, తనను 'భక్తురాలు', 'అంధ భక్తురాలు' లేదా 'జాతీయవాది' అని ఎలా పిలిచినా స్వాగతిస్తానని వ్యాఖ్యానించారు. గతంలోనూ ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యల సందర్భంగా విమర్శలు ఎదుర్కొన్న ఇషా, తాను కేవలం అంధ భక్తురాలినే కాక 'భారత భక్తురాలిని' అంటూ ధీటుగా బదులిచ్చారు. హిందీ, తెలుగు భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఇషా వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027 Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**